Follow: @ANNTELUGU
06-06-2026
ANN తెలుగు
# మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 157 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




టాప్ న్యూస్

## రాజ్యసభకు లింగమనేని రమేష్
పవన్ కల్యాణ్ ప్రకటన



02

## కొత్త పార్టీ పెడుతున్నా సింగిల్‌గా పోటీ చేస్తా
అన్నామలై ప్రకటన



02

## టీఎంసీలో చిచ్చు
రెబల్ ఎమ్మెల్యేలతో టచ్ లో 23 మంది ఎంపీలు



02

## భారత్‌లో రూ.3 లక్షల కోట్ల భారీ పెట్టుబడి
- 5గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ల అభివృద్ధి
- ప్రధాని మోదీతో ఎయిర్ ట్రంక్ వ్యవస్థాపకుడు, సీఈఓ రాబిన్ ఖుదా భేటీ



03

# కేసీఆర్ రాసిపెట్టుకో
## పాలమూరు జిల్లాల్లో మీ పార్టీని బొంద పెడతాం
2029లో కాంగ్రెస్ ను మళ్ళీ అధికారంలోకి తెస్తాం
**పాలమూరు జిల్లా ప్రాజెక్టులకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు ఇస్తా**
ఎవరు దాగుడుమూతలాడినా
అడుగుతాం...కడుగుతాం.. తుమ్మిడిహెట్టి కట్టి తీరుతాం
కేసీఆర్ అసెంబ్లీకి రా.. మీ పదేళ్ళు.. మా రెండేళ్ళపాలనపై చర్చిద్దాం
జడ్చర్ల సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాళ్ళు



(జడ్చర్ల నుండి మహా పత్రిక ప్రత్యేక ప్రతినిధి)
పాలమూరు ప్రజలకు మట్టి తీసుడే కాదు... మట్టితో కప్పడం కూడా తెలుసు. కెసీఆర్ రాసిపెట్టుకో... పాలమూరు జిల్లాల్లో మీ పార్టీని బొంద పెడతాం. జిల్లాలో మీ పార్టీకి చెందిన వారిని ఒక్కరిని కూడా ఎమ్మెల్యేగా గెలవనీయం అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. రెండురోజుల పాటు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ప్రాజెక్టుల పూర్తికి పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షలు జరిపి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జడ్చర్లో జరిగిన బహిరంగసభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 2029లో కాంగ్రెస్ ను అధికారంలోకి తెస్తామని, 2034 దాకా తానే ఉంటానన్నారు. రేవంత్ రెడ్డి ఏం చేసిండని కొందరు అవాకులు చవాకులు పేలుతున్నారు. 15 లక్షల రేషన్ కార్డులు అందించాం. 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశాం. 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాం. పది వేల కోట్లు మహిళలకి ఉచిత బస్సు ప్రయాణానికిఖర్చు చేశాం. ఇలా మేం చేసింది చెప్పాలంటే రాస్తే రామాయణం.. చెబితే భారతం . మీ పదేళ్ల పాలనపై, మా రెండున్నరేళ్ల పాలనపై చర్చిద్దాం.. కెసీఆర్ అసెంబ్లీకి రా. నీ పేరు కేసీఆర్ అయితే చర్చకు రా... చర్చిద్దాం... మాది తప్పైతే నేను క్షమాపణ చెబుతా అంటూ సీఎం సవాల్ విసిరారు. గోదావరి జలాలపై చర్చిద్దామంటే మహారాష్ట్ర ముఖ్యమంత్రి దాగుడుమూతలాడుతున్నారు. బీజేపీ నాయకులు తప్పించుకు తిరుగుతున్నారు. ఎన్నాళ్లు తప్పించుకు తిరుగుతారు? ఎవరు దాగుడుమూతలాడినా, తప్పించుకు తిరిగినా... అడుగుతాం...కడుగుతాం..

మిగతా 2వ పేజీలో




ఆర్టీసీలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు
## గ్రీన్ సిగ్నల్
సన్నాహాలు షురూ .. రిటర్నింగ్ అధికారిని నియమించిన కార్మికశాఖ

02



## రూ.30 వేల కోట్ల భూమిని రక్షించిన హైడ్రా
పుప్పాలగూడలో 198 ఎకరాల కబ్జా యత్నాలకు చెక్.

02



## త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ
పరిశీలనలో పాలిమర్ నోట్ల ప్రతిపాదన.
ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా.

02






## ప్రపంచస్థాయికి ఆంధ్రా రొయ్య
- బ్లూ ఎకానమీకి ఏపీనే కేంద్ర బిందువు.
- విశాఖ ఆక్వా సదస్సులో ముఖ్యమంత్రి వెల్లడి.
- అమరావతి నుంచి నెల్లూరు వరకు 'ఆక్వా కారిడార్' అభివృద్ధి.
- దేశ సముద్ర ఆహార ఎగుమతుల్లో రాష్ట్ర వాటా 38 శాతం.
- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు.

02



## వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అరెస్ట్
- గండిపేట భూ కుంభకోణం కేసులో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- నకిలీ జీవోలతో ప్రభుత్వ భూముల కబ్జాకు యత్నించినట్లు ఆరోపణలు
- తమిళనాడులోని కాంచీపురంలో పట్టుకున్న పోలీసులు

02

## రెపో రేటు యథాతథం
**5.25 శాతంగా కొనసాగింపు.**
- ఆర్థిక వృద్ధి అంచనాలకు ఆర్‌బీఐ కోత.
- 6.6 శాతానికి పరిమితం
- ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశంలో ఏకగ్రీవ నిర్ణయం
- తక్కువ వర్షపాతం, ఎల్ నినో ప్రభావంతో ద్రవ్యోల్బణ ముప్పు
- ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉన్నా సవాళ్లు తప్పవన్న గవర్నర్

03

# ప్రపంచస్థాయికి ఆంధ్రా రొయ్య



**అమరావతి, మహా :** భవిష్యత్తంతా బ్లూ ఎకానమీ దేనని, భారతదేశ సముద్ర ఆర్థిక వ్యవస్థకు ఆంధ్రప్రదేశ్‌ను ప్రధాన కేంద్ర బిందువుగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడంలో ఆక్వా రంగం అత్యంత కీలక పాత్ర పోషించనుందని ఆయన ఉద్ఘాటించారు. విశాఖపట్నంలో ఘనంగా నిర్వహించిన 'సీఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్‌షాప్'కు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఆక్వా రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం సిద్ధం చేసిన బృహత్ ప్రణాళికలను, దార్శనికతను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. భారతదేశ సముద్ర ఆహార ఉత్పత్తులు, ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే అగ్రగామిగా కొనసాగుతోందని చంద్రబాబు గణాంకాలతో సహా వివరించారు. దేశం మొత్తమ్మీద జరిగే చేపల ఉత్పత్తిలో 28 శాతం, రొయ్యల ఉత్పత్తిలో ఏకంగా 66 శాతం వాటా ఏపీదేనని ఆయన ప్రకటించారు. అంతేకాకుండా, దేశ సముద్ర ఆహార ఎగుమతుల ద్వారా లభించే ఆదాయంలో 38 శాతం, అంటే దాదాపు రూ.28,000 కోట్లకు పైగా ఒక్క ఆంధ్రప్రదేశ్ నుంచే సమకూరుతోందని గుర్తుచేశారు. అయితే, ప్రపంచ సీఫుడ్ వ్యాపారంలో భారతదేశ వాటా ప్రస్తుతం కేవలం 5 శాతంగానే ఉందని, దీనిని మరింత విస్తరించేందుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ఆక్వా రంగం వృద్ధి చెందితే దేశ ఎగుమతులు కూడా దానంతట అదే పెరుగుతాయన్న ఆయన, అంతర్జాతీయ మార్కెట్లో 'ఆంధ్రా ష్రింప్.. ఇండియా సీఫుడ్' అనే ఒక శక్తివంతమైన బ్రాండ్‌ను ప్రతిష్ఠించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో ఆక్వా రంగాన్ని సమగ్రంగా బలోపేతం చేసేందుకు అమరావతి, భీమవరం, కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం, నెల్లూరు ప్రాంతాలను కలుపుతూ ఒక సుదీర్ఘ 'ఆక్వా కారిడార్'ను అభివృద్ధి చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ కారిడార్ పరిధిలో అత్యాధునిక పరిశోధనలు, ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, అధునాతన సాంకేతికతతో కూడిన ఒక సంపూర్ణ ఎకో సిస్టమ్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. అతి తక్కువ పెట్టుబడితో నాణ్యమైన, అత్యధిక ఉత్పత్తిని సాధించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్తూ.. 'పాండ్ టు పోర్టు, ఫార్మర్ టు గ్లోబల్ కన్స్యూమర్' (చెరువు నుంచి ఓడరేవు వరకు.. రైతు నుంచి ప్రపంచ వినియోగదారుడి వరకు) అనే వినూత్న విధానంతో ముందుకు సాగుతామని భరోసా ఇచ్చారు. ఆక్వా రంగ పురోగతి కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టే ప్రతి సంస్కరణకు, చర్యకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా కేంద్ర మత్స్య శాఖ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు కోసం 15 రోజుల్లోగా అనువైన స్థలాన్ని కేటాయిస్తామని ప్రకటించారు. కాకినాడ పోర్టు ఆధునికీకరణకు కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ సానుకూలంగా స్పందించడంపై హర్షం వ్యక్తం చేస్తూ, మెగా సీఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు కేంద్రం అందిస్తున్న మద్దతును కొనియాడారు. ఇదే క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని శ్లాఘిస్తూ, 21వ శతాబ్దం మోదీదేనని, దేశాన్ని భవిష్యత్తులో అగ్రస్థానంలో నిలిపేందుకు ఆయన అద్భుతంగా కృషి చేస్తున్నారని, ప్రధానిని మరింత బలపర్చాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. సదస్సుకు తాను సైకిల్‌పై వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, సైక్లింగ్ వల్ల ఆరోగ్యంతో పాటు పొదుపు సాధ్యమవుతుందని సూచించారు. ప్రోటీన్లు పుష్కలంగా ఉండే ఆక్వా ఉత్పత్తులను ఆహారంలో భాగం చేసుకుని ప్రజలంతా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు.



# త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ.

- **పరిశీలనలో పాలిమర్ నోట్ల ప్రతిపాదన.**
- **ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా**

**ముంబయి, మహా :** దేశంలో త్వరలోనే ప్లాస్టిక్ (పాలిమర్) కరెన్సీ నోట్లు చలామణిలోకి రాబోతున్నాయంటూ జరుగుతున్న ప్రచారంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందించారు. ప్లాస్టిక్ నోట్ల ప్రతిపాదనను పరిశీలిస్తున్న మాట వాస్తవమేనని, అయితే ఈ ప్రక్రియ ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని ఆయన స్పష్టం చేశారు.
దేశవ్యాప్తంగా పేపర్ కరెన్సీ వాడకం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ప్లాస్టిక్ నోట్లను తీసుకురావడానికి గల సాధ్యాసాధ్యాలపై ఆర్‌బీఐ తీవ్రంగా కసరత్తు చేస్తోంది. కాగితపు నోట్ల ముద్రణకు భారీగా ఖర్చు అవ్వడం, అవి త్వరగా పాడైపోయి చలామణి నుంచి తొలగించాల్సి రావడం వంటి కారణాలతోనే ఈ ప్రత్యామ్నాయంపై ఆర్బీఐ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్లాస్టిక్ నోట్ల వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు వాటి ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే సాంకేతిక, నిర్వహణపరమైన సవాళ్లపై ఆర్బీఐకి చెందిన నిపుణుల బృందం లోతుగా అధ్యయనం చేస్తోంది.
నిజానికి, ప్లాస్టిక్ నోట్ల ప్రస్తావన రావడం ఇదే తొలిసారి కాదు. 2014 ఫిబ్రవరిలోనే కేంద్ర ప్రభుత్వం దీనిపై పార్లమెంటుకు సమాచారం అందించింది. దేశంలోని భౌగోళిక, వాతావరణ వైవిధ్యాలను పరీక్షించడానికి ప్రయోగాత్మకంగా ఐదు నగరాలను (కొచ్చి, మైసూరు, జైపూర్, సిమ్లా, భువనేశ్వర్) ఎంపిక చేసింది. ఆయా ప్రాంతాల్లో రూ.100 కోట్ల విలువైన ప్లాస్టిక్ నోట్లను ప్రవేశపెట్టాలని అప్పట్లో భావించారు. కానీ, కొన్ని సాంకేతిక, నిర్వహణ లోపాల వల్ల ఆ ప్రాజెక్టు అప్పట్లో తాత్కాలికంగా నిలిచిపోయింది. తాజాగా ఆర్‌బీఐ మళ్లీ ఈ పాత ఫైల్‌ను కదిలించడంతో త్వరలోనే దేశంలో ప్లాస్టిక్ నోట్లు అందుబాటులోకి వస్తాయనే ఊహాగానాలు మరోసారి ఊపందుకున్నాయి.

# వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అరెస్ట్

- **గండిపేట భూ కుంభకోణం కేసులో అదుపులోకి తీసుకున్న పోలీసులు**
- **నకిలీ జీవోలతో ప్రభుత్వ భూముల కబ్జాకు యత్నించినట్లు ఆరోపణలు**
- **తమిళనాడులోని కాంచీపురంలో పట్టుకున్న పోలీసులు**

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ శివారు గండిపేటలో వెలుగుచూసిన వేల కోట్ల రూపాయల భూ కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిని హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. కొంతకాలంగా పరారీలో ఉన్న ఆయనను తమిళనాడులోని కాంచీపురంలో అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.
గండిపేట, నార్సింగి ప్రాంతాల్లోని అత్యంత విలువైన ప్రభుత్వ భూములకు సంబంధించి నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు (జీవోలు) సృష్టించి, వాటి ద్వారా అక్రమంగా విక్రయించేందుకు బ్రహ్మనాయుడు, మరికొందరు ప్రయత్నించినట్లు ప్రధాన ఆరోపణలు ఉన్నాయి. ఈ



భారీ భూ కుంభకోణం విలువ రూ.1,500 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. వారిచ్చిన సమాచారంతో ఈ కుంభకోణంలో బ్రహ్మనాయుడి పాత్రపై దృష్టి సారించారు. అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న ఆయన కోసం గాలింపు చేపట్టి, చివరకు కాంచీపురంలో పట్టుకున్నారు.

# కేసీఆర్ రాసిపెట్టుకో

**( మొదటి పేజీ రువాయి )**
తుమ్మిడిహెట్టి కట్టి తీరుతాం అని సీఎం స్పష్టం చేశారు.

పంచకట్టుకున్నోడు వైఎస్సార్ కాలేడు

కేసీఆర్ ఐదేళ్లు పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నా.. ఐదు సార్లు కూడా పాలమూరుకు రాలేదన్నారు. తాను కూడా పాలమూరు జిల్లాలోని మిడ్జిల్ నుంచే మొదట జడ్పీటీసీగా గెలిచానని.. నాటి జడ్పీటీసీనే.. నేడు సీఎంగా జిల్లా ప్రజల ముందున్నానని, పాలమూరు జిల్లాలోని సమస్యలన్నింటినీ తీరుస్తానని మాటిచ్చారు. కేసీఆర్ ఇక్కడ కాళేశ్వరం కడితే అది కూలేశ్వరం అయిందని, ఇక ఏం చేసినా తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ నేతలను నమ్మరన్నారు. బీఆర్ఎస్ నేతలు పాదయాత్రలు కాదు కదా.. ఇక్కడి నుంచి కాశీ వరకూ పొర్లుదండాలు పెట్టినా వారు చేసిన పాపాలు తీరవన్నారు. పాలమూరు నుంచి గెలిచి.. ఇక్కడి నుంచి పారిపోయిన కేసీఆర్ ద్రోహి అవుతారా? లేక పాలమూరు అభివృద్ధికోసం సీఎంగా కృషి చేస్తున్న తాను ద్రోహినవుతానా? ప్రజలకు స్పష్టంగా తెలుస్తోందన్నారు. కేసీఆర్ తర్వాత ఆయన కొడుకు, మనవడు రాజ్యమేలడానికి ప్రజలు పిచ్చోళ్లు కాదన్నారు. లాల్చి వేసుకున్నోడు లాల్ బహదూర్ శాస్త్రి కాదు.. గడ్డం పెంచుకున్నోడు భగత్ సింగ్ కాదు.. పంచకట్టుకున్నోడు వైఎస్సార్ కాలేడన్నారు. పంచలు కట్టుకుని ఉదండపూర్ కు పాదయాత్రకు వస్తే తొండలు విడిచి కొడతారన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు లక్ష కోట్లకు పైగా ఖర్చుచేసిన



కేసీఆర్.. ఉదండపూర్ ముంపు బాధితులకు మాత్రం రూ.800 కోట్లు ఇవ్వకుండా జైల్లో పెట్టించి కొట్టించారని ఆరోపించారు. అలాంటి బీఆర్ఎస్ నేతలు నోరు తెరిస్తే అబద్ధాలు చెప్తున్నారని, పాలమూరులో బీఆర్ఎస్ జెండా ఎగరనివ్వమన్నారు. గద్దెలు కూలాలి.. బీఆర్ఎస్ జెండాలు దిగాలని ప్రజలకు పిలుపున్నారు. బీఆర్ఎస్ నేతలు ఇళ్లు కట్టిన చోట ఓట్లు అడగాలని, తాను ఇందిరమ్మ ఇళ్లు కట్టినచోట ఓట్లు అడుగుతానని.. బీఆర్ఎస్ నేతలకు డిపాజిట్లు వస్తే నా పేరు మార్చుకుంటా అని బిగ్ చాలెంజ్ చేశారు. తాడూ, బొంగరం లేని ఇద్దరు నేతలను తమపైకి వదిలారని, వాళ్లతో చెప్పించుకునే పరిస్థితిలో తాములేమని సీఎం రేవంత్ అన్నారు. 2034 వరకూ తమదే అధికారమని.. కేసీఆర్ కు చేతనైతే తమ గెలుపును అడ్డుకోవాలని సవాల్ చేశారు. 2029లో గెలుపెవరిదో తేల్చుకుందామన్నారు. సభకు అనిరుధ్ రెడ్డి అధ్యక్షత వహించగా, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి క్రిష్ణారావు, వాకిటి శ్రీహరి, జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.





# ఆర్టీసీలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్

**ఆర్టీసీలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్**





: ఆర్టీసీ కార్మికసంఘం గుర్తింపు ఎన్నికలకు నగారా మోగనుంది. ఎన్నికల నిర్వహణకు కార్మిక శాఖ ఏర్పాట్లు మొదలుపెట్టింది. ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహిస్తామని, ఆ తర్వాతే విలీన ప్రక్రియ ప్రారంభిస్తామని రాష్ట్ర రవాణాశాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ తాజాగా ప్రకటించగా, శుక్రవారం హైదరాబాద్ జంటనగరాల జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సునీతా గోపాల్‌దాస్‌ను రిటర్నింగ్ అధికారిగా నియమిస్తూ కార్మిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్స్ (పి.ఎస్.యు) నిబంధనల ప్రకారం.. ఉద్యోగుల ప్రాతినిధ్య కార్మిక సంఘాన్ని ఎన్నుకునేందుకు ఈ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించే బాధ్యతను రిటర్నింగ్ అధికారికి అప్పగించారు. నామినేషన్ల పరిశీలన, అర్హులైన ఓటర్ల జాబితా ప్రకటన. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి సహా ఎన్నికల నియమావళి ప్రకారం వచ్చే వివాదాల పరిష్కారం మొత్తం రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలోనే కొనసాగుతుంది. ఎన్నికల సజావుగా నిర్వహించేందుకు కార్మిక శాఖ ఇప్పటికే టీఎస్ఆర్టీసీ యాజమాన్యంతో పాటు వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులతో సమన్వయ సమావేశాలు ప్రారంభించింది. ఇందుకు సంబంధించిన వివరణాత్మక ఎన్నికల షెడ్యూల్, పోలింగ్ కేంద్రాలు, ఓటరు అర్హత ప్రమాణాలను రిటర్నింగ్ అధికారి త్వరలోనే విడిగా ప్రకటిస్తారు. కార్మికుల సంక్షేమం, హక్కుల కోసం జరిగే ఈ ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని, ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు అన్ని కార్మిక సంఘాలు, ఉద్యోగులు, వాటాదారులు సహకరించాలని కార్మిక శాఖ విజ్ఞప్తి చేసింది. దీంతో ఆర్టీసీ విలీన ప్రక్రియపై ప్రభుత్వం కీలక ముందడుగు వేసినట్లు అయ్యింది. ఓటర్ల జాబితాలు, ఏరియాల వారీ సమావేశాల నిర్వహణ తర్వాత జూలైలో ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చినట్లుగా ఆర్టీసీలో కార్మికసంఘాల ఎన్నికలను మళ్ళీ పునరుద్ధ

# రూ.30 వేల కోట్ల భూమిని రక్షించిన హైడ్రా

- **పుప్పాలగూడలో 198 ఎకరాల కబ్జా యత్నాలకు చెక్.**

**హైదరాబాద్, మహా :** దశాబ్దాలుగా వివాదాల్లో నలుగుతూ భూబకాసురుల పాలుకాబోతున్న రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడఖాజాగూడ సరిహద్దుల్లోని సుమారు 198 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు శుక్రవారం తమ పూర్తి ఆధీనంలోకి తీసుకున్నారు. బహిరంగ మార్కెట్లో సుమారు రూ.30,000 కోట్ల విలువ చేసే ఈ భూమికి పటిష్టమైన కంచె వేసి అక్రమార్కుల ఆట కట్టించారు. ఈ భూమి కేవలం ఖరీదైనది మాత్రమే కాదు, 250 కోట్ల సంవత్సరాల నాటి అరుదైన చారిత్రక రాతి గుట్టలకు నిలయం కావడం విశేషం. దశాబ్దాల తరబడి సాగుతున్న భూ దందాకు స్వస్తి పలుకుతూ ఈ ఆపరేషన్‌తో అమూల్యమైన ప్రకృతి, చారిత్రక సంపదకు హైడ్రా రక్షణ కవచం ఏర్పాటు చేసింది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌ఎండీఏకు కేటాయించిన ఈ సర్కారీ స్థలంలో అద్భుతమైన రాతి శిలలు, గుహలు, పచ్చని చెట్లు విస్తరించి ఉన్నాయి. ఈ అమూల్యమైన ప్రకృతి సంపదను కాపాడాలంటూ 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు దశాబ్దాలుగా న్యాయపోరాటం సాగిస్తున్నారు. వారి అలుపెరగని పోరాటంపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం, ఈ రాతి గుట్టలతో పాటు ప్రభుత్వ భూమిని సంరక్షించాలని మున్సిపల్, రెవెన్యూ శాఖలను 2019లోనే స్పష్టంగా ఆదేశించింది. అయితే, క్షేత్రస్థాయిలో హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేయడంలో అధికారుల జాప్యం కారణంగా ఈ వేల కోట్ల భూమి కబ్జాదారుల పాలయ్యే ప్రమాదం పొంచి ఉందని 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు నేరుగా హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెంటనే అప్రమత్తమై క్షేత్రస్థాయిలో పర్యటించారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారుల బృందంతో కలిసి సంయుక్తంగా సర్వే నిర్వహించి, అంగుళం అంగుళం కొలతలు వేసి ఆ భూమిని ప్రభుత్వ ఆస్తిగా నిర్ధారించారు. అనంతరం శుక్రవారం పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టారు.



**పుప్పాలగూడలో విలువైన భూమి**

రెవెన్యూ రికార్డుల ప్రకారం పరిశీలిస్తే.. సర్వే నంబర్ 452/1లో 174 ఎకరాలు, 454/1లో 119.05 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఓవర్‌ల్యాప్ సమస్యల కారణంగా 63.05 ఎకరాలు ప్రైవేటు వ్యక్తులకు చెందినదిగా గుర్తించి పక్కనపెట్టారు. మిగిలిన భూమిలో స్థానిక దేవాలయాలకు 5 ఎకరాలు, దర్గాకు 5 ఎకరాలు కేటాయించగా.. మిగిలిన నికరమైన దాదాపు 200 ఎకరాల హెచ్‌ఎండీఏ భూమిని హైడ్రా తన అదుపులోకి తీసుకుని రక్షించింది. హైడ్రా చేపట్టిన ఈ మెరుపు ఆపరేషన్‌పై 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులతో పాటు స్థానిక పర్యావరణ ప్రేమికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సహజ సిద్ధమైన వ్యూ పాయింట్లు, చారిత్రక గుట్టలను కాపాడి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసినందుకు ప్రభుత్వాన్ని కొనియాడుతున్నారు. మరోవైపు ఈ గుట్టలను ఆనుకుని ఉన్న భగీరథమ్మ చెరువును సైతం హైడ్రా ఆధ్వర్యంలో పునరుద్ధరిస్తున్నారు. ఒకవైపు ఎత్తైన కొండలు, మరోవైపు జలకళతో నిండిన చెరువుతో ఈ ప్రాంతం భవిష్యత్తులో నగరానికే తలమానికంగా, ఒక అద్భుతమైన పర్యాటక కేంద్రంగా విరాజిల్లనుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



# రాజ్యసభకు లింగమనేని రమేష్

**... పవన్ కళ్యాణ్ ప్రకటన**

**అమరావతి, మహా :** జనసేన పార్టీకి కేటాయించిన రాజ్యసభ స్థానానికి అభ్యర్థిగా పారిశ్రామికవేత్త లింగమనేని రమేష్ పేరును పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అధికారికంగా ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. లింగమనేని రమేష్ శనివారం మధ్యాహ్నం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు. రమేష్ 2015 నుంచి పవన్ కళ్యాణ్‌తో, జనసేన పార్టీతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధికి సామాజిక వర్గాల మధ్య సఖ్యత, సోషల్ ఇంజినీరింగ్ అవసరమనే పవన్ ఆలోచనా విధానానికి ఆకర్షితులై ఆయనకు వెన్నుదన్నుగా నిలిచినట్లు పార్టీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. 2019 ఎన్నికల్లో పార్టీకి ప్రతికూల ఫలితాలు వచ్చినప్పటికీ, రమేష్ పార్టీ సిద్ధాంతాలపై, పవన్ కళ్యాణ్ నాయకత్వంపై పూర్తి విశ్వాసంతో నిలిచారని జనసేన తెలిపింది. ఎన్నో ఒత్తిళ్లు, సవాళ్లు ఎదురైనా పార్టీకి అండగా నిలిచిన వారికి కుల, మతాలు పరిగణనలోకి తీసుకోకుండా నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలనే సూత్రం ప్రకారమే ఈ ఎంపిక జరిగినట్లు స్పష్టం చేసింది. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచినందుకే ఆయనకు ఈ అవకాశం కల్పించినట్లు పార్టీ వర్గాలు వివరించాయి.

# కొత్త పార్టీ పెడుతున్నా సింగిల్ గా పోటీ చేస్తా

**అన్నామలై ప్రకటన**

**చెన్నై, మహా :** బీజేపీ పార్టీకి రాజీనామా చేసిన కె.అన్నామలై.. కొత్త రాజకీయ పార్టీ పెడుతున్నట్లు ప్రకటించారు. తమిళనాడు రాజకీయాల్లో కొత్త పార్టీ అవసరం ఉందని.. కామన్ మ్యాన్ పాలిటిక్స్ రావాల్సి ఉందని.. ఆ దిశగానే రాజకీయ పార్టీ ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. రాబోయే 2029 పార్లమెంట్ ఎన్నికల్లోనూ పోటీ చేస్తామని.. ఆ తర్వాత 2031లో జరగబోయే తమిళనాడు ఎన్నికల్లో అన్ని స్థానాలకు పోటీ చేస్తామని ప్రకటించారు. ఈ ఐదేళ్లల్లో రాజకీయ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేస్తానని అన్నామలై స్పష్టం చేశారు




# టీఎంసీలో చిచ్చు

**రెబల్ ఎమ్మెల్యేలతో టచ్ లో 23 మంది ఎంపీలు**

ఎంపీగా పోటీచేసే యోచనలో మమత

**కోల్‌కతా, మహా :** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్ కు మరిన్ని కష్టాలు తప్పేలా లేవు. పార్టీ రెబల్ గ్రూప్ ఎమ్మెల్యలతో 23 మంది ఎంపీలు ప్రస్తుతం సంప్రదింపులు సాగిస్తున్నట్టు ఆ పార్టీ వర్గాలు తాజాగా బాంబు పేల్చాయి. దీంతో రాబోయే రోజులలో టీఎంసీ పార్లమెంటరీ విభాగం నిట్టనిలువుగా చీలిపోయే అవకాశాలు లేకపోలేదని అంటున్నారు. టీఎంసీ పార్లమెంటరీ ప్రత్యేక కూటమిగా ఏర్పడేందుకు, చీలక తెచ్చేందుకు తగిన సంఖ్యాబలంపై కూడా చర్చ జరుగుతోందని చెబుతున్నారు. టీఎంసీకి లోక్‌సభలో ప్రస్తుతం 29 మంది ఎంపీలు ఉన్నారు. ప్రత్యేక గ్రూపుగా ఏర్పడి ఫిరాయింపుల చట్టం నుంచి వేటుపడకుండా ఉండాలంటే కనీసం 23 మంది మద్దతు ఇందుకు అవసరమవుతుంది. రాజ్యసభ పరంగా చూస్తే టీఎంసీకి 13 మంది ఎంపీలున్నారు. ప్రత్యేక గ్రూపుగా గుర్తింపు పొందాలంటే కనీసం 9 మంది ఎంపీలు కలిసిరావాలి. ఈ పరిణామాలపై రెబల్ నేత రీతాబబ్రత బెనర్జీని ప్రశ్నించగా, గత వారం రోజుల్లో తాను ఏ ఎంపీతోనూ మాట్లాడలేదని, అందువల్ల వాళ్లు ఏమి చేయాలనుకుంటున్నారో తనకు తెలియదని చెప్పారు. అయితే రేపటి రోజు ఏమి జరుగుతుందో ఎవరూ చెప్పలేరని అన్నారు. కాగా మమతాబెనర్జీ మళ్ళీ ఎంపీగా పోటీచేసేయోచనలో ఉన్నట్లుగా తెలుస్తోంది.



# భారత్‌లో రూ.3 లక్షల కోట్ల భారీ పెట్టుబడి

- 5గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ల అభివృద్ధి
- ప్రధాని మోదీతో ఎయిర్ ట్రంక్ వ్యవస్థాపకుడు, సీఈఓ రాబిన్ ఖుదా భేటీ

ప్రముఖ టెక్నాలజీ కంపెనీ 'ఎయిర్‌ట్రంక్' భారత దేశంలో భారీ పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమైందని ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం తెలిపారు. ఎయిర్ ట్రంక్ వ్యవస్థాపకుడు, సీఈఓ రాబిన్ ఖుదాతో సమావేశమైన తర్వాత మోదీ ఈ విషయాన్ని వెల్లడించారు. భారత్‌లో 5 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్లను అభివృద్ధి చేసే వ్యూహాన్ని, పెట్టుబడి ప్రణాళికలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. భారతదేశ డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధి అద్భుతమైన వేగంతో దూసుకుపోతోంది. ఎయిర్‌ట్రంక్ సంస్థ మన దేశంలో దాదాపు 30 బిలియన్ డాలర్లు (రూ.3 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది. దీని ద్వారా 5 గిగా వాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్‌ను అభివృద్ధి చేయనుంది. భారత్ డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలో పెట్టిన అతిపెద్ద పెట్టుబడుల్లో ఇది ఒకటి." అని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు.

# నిధుల కోసమే పాక్ డ్రామాలు

- ట్రంప్‌నకు షెహబాజ్ షరీఫ్ భజన.
- భారత సైన్యం దెబ్బకు వణికి-పోయి.. ఇప్పుడు అమెరికాకు ప్రశంసలు.
- గతేడాది కాల్పుల విరమణకు ట్రంపే కారణమన్న పాక్ ప్రధాని.
- ఆ వాదనను గతంలోనే కొట్టి పారేసిన భారత విదేశాంగ శాఖ.
- ఆపరేషన్ సిందూర్' దెబ్బకు దిగివచ్చింది పాకిస్థానే.



**ఢిల్లీ, మహా :** భారత సైన్యం చేతిలో చావుదెబ్బ తిన్న పాకిస్థాన్ ఇప్పుడు ప్లేటు మార్చింది. పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి, నిధుల కోసం అగ్రరాజ్యం ముందు మోకరిల్లుతూ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఆకాశానికెత్తేస్తూ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సరికొత్త డ్రామాలకు తెరతీశారు. గతేడాది (2025) మే 10న భారత్‌తో జరిగిన కాల్పుల విరమణకు ట్రంప్ చేసిన 'సమయానుకూల, నిర్ణయాత్మక జోక్యమే' కారణమని, ఆయన్ను తాము ఎప్పటికీ 'శాంతిదూత'గా గుర్తుపెట్టుకుంటామని షరీఫ్ వ్యాఖ్యానించారు. ఇస్లామాబాద్‌లోని అమెరికా ఎంబసీలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన ఈ మేరకు ట్రంప్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. అయితే, అమెరికా నుంచి ఆర్థిక సాయం దండుకునేందుకే షరీఫ్ ఇలాంటి భజన కార్యక్రమాలకు పూనుకున్నారని దౌత్య నిపుణులు విశ్లేషిస్తున్నారు. గతేడాది ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు 26 మంది అమాయక పర్యాటకులను పొట్టనపెట్టుకున్న అమానుష దాడికి ప్రతీకారంగా, భారత సైన్యం 2025 మే 7వ తేదీన పాక్‌పై 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన విషయం విదితమే. ఈ ఆపరేషన్‌లో భాగంగా భారత వైమానిక దళం పాక్ గడ్డపైకి దూసుకెళ్లి ఉగ్రవాద శిబిరాలను, స్థావరాలను ఊచకోత కోసింది. భారత సైన్యం సృష్టించిన ఈ విధ్వంసాన్ని తట్టుకోలేక పాక్ ఆర్మీ అక్షరాలా చేతులెత్తేసింది. ఆ దెబ్బకు తాళలేక పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) స్వయంగా భారత సైనిక అధికారులకు ఫోన్ చేసి, ప్రాధేయపడి మరీ కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నారు.కానీ, వాస్తవాలను వక్రీకరిస్తూ ఈ క్రెడిట్ మొత్తాన్ని తన ఖాతాలో వేసుకునేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నిస్తుండటం, దానికి పాక్ ప్రధాని వంతపాడటం గమనార్హం. తాను మధ్యవర్తిత్వం వహించి ఈ యుద్ధాన్ని ఆపేశానని, ప్రపంచంలో ఎనిమిది యుద్ధాలను ఆపానంటూ ట్రంప్ పదే పదే ప్రస్తావిస్తుండగా, షరీఫ్ దానికి అవునంటూ తలాడిస్తున్నారు. అయితే, వీరిద్దరి వాదనలకు భారత విదేశాంగ శాఖ గతంలోనే గట్టిగా చెక్ పెట్టింది. ఈ వ్యవహారంలో అసలు మూడో దేశం ప్రమేయమే లేదని, పాక్ సైన్యమే స్వయంగా కాల్పుల విరమణ కోరిందని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అత్యంత స్పష్టంగా తేల్చిచెప్పారు.

## పాక్ గూఢచర్యం కేసు

- యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాకు బెయిల్ నిరాకరణ
- ఆమె బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు ధర్మాసనం

**న్యూఢిల్లీ, మహా :** పాకిస్థాన్ నిఘా ఏజెంట్లకు సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నారన్న గూఢచర్యం ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఆమె దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను శుక్రవారం సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. దీంతో ఆమె జ్యుడీషియల్ కస్టడీలోనే కొనసాగనుంది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించి, ఆమెకు ఉపశమనం కల్పించడానికి నిరాకరించింది. ఈ ఏడాది మార్చిలో పంజాబ్, హర్యానా హైకోర్టు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించడంతో జ్యోతి మల్హోత్రా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆమెపై దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు ప్రాథమిక ఆధారాలున్నాయని అప్పట్లో హైకోర్టు వ్యాఖ్యానించింది. హర్యానా పోలీసులు నమోదు చేసిన ఈ కేసులో జ్యోతిపై అధికారిక రహస్యాల చట్టం (1923), భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) కింద పలు సెక్షన్లతో అభియోగాలు మోపారు. 'ట్రావెల్ విత్ జో' అనే యూట్యూబ్ ఛానెల్ నడుపుతున్న ఆమె, పాకిస్థాన్ పర్యటనల సందర్భంగా న్యూఢిల్లీలోని పాక్ హైకమిషన్ అధికారి ఎహసాన్‌ఉర్‌రహీంతో పరిచయం పెంచుకున్నట్లు దర్యాప్తులో తేలింది. ఆ తర్వాత సోషల్ మీడియా ద్వారా పలువురు పాక్ నిఘా ఏజెంట్లతో సంబంధాలు ఏర్పరచుకుని, వ్యూహాత్మక ప్రాంతాలైన పాండో డ్యామ్, మున్నాబావో రైల్వే స్టేషన్, సీఆర్‌పీఎఫ్ క్యాంప్ వంటి వాటికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు పంపినట్లు పోలీసులు ఆరోపించారు.ఈ కేసులో తనను తప్పుగా ఇరికించారని, దర్యాప్తు పూర్తయి చార్జిషీట్ కూడా దాఖలైనందున బెయిల్ మంజూరు చేయాలని జ్యోతి వాదించింది. అయితే, ఆమె పాక్ ఏజెంట్లతో రహస్య సంభాషణలు జరిపారని, చాట్ రికార్డులను తొలగించారని దర్యాప్తు బృందం (సిట్) పేర్కొంది. 2025 మే 16న హిసార్‌లో నమోదైన ఈ కేసులో అరెస్ట్ అయిన జ్యోతి, అప్పటి నుంచి కస్టడీలోనే ఉంది. గత ఏడాది ఆగస్టులో సిట్ సుమారు 2,500 పేజీల చార్జిషీట్‌ను కోర్టుకు సమర్పించింది.

# షర్మిలకు దక్కని రాజ్యసభ అవకాశం



**హైదరాబాద్, మహా :** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కర్ణాటక నుంచి రాజ్యసభ బరిలో నిలవబోతున్నారంటూ గత కొన్ని రోజులుగా రాజకీయ వర్గాల్లో జోరుగా సాగిన ఊహాగానాలకు ఎట్టకేలకు తెరపడింది. ఎగువ సభ ద్వారా పార్లమెంట్‌లో అడుగుపెట్టాలని భావించిన ఆమెకు కాంగ్రెస్ అధిష్ఠానం పెద్ద షాక్ ఇచ్చింది. కర్ణాటక నుంచి ఖాళీగా ఉన్న మూడు రాజ్యసభ స్థానాల భర్తీకి సంబంధించి ఏఐసీసీ తాజాగా విడుదల చేసిన అభ్యర్థుల తుది జాబితాలో వైఎస్ షర్మిల పేరు లేకపోవడం గమనార్హం. జాతీయ స్థాయి సమీకరణాలు, స్థానిక రాజకీయాల నేపథ్యంలో అధిష్ఠానం ఆమె అభ్యర్థిత్వాన్ని పక్కనబెట్టినట్లు తెలుస్తోంది.
కర్ణాటక నుంచి ఖాళీ అయిన ఆ మూడు స్థానాలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలను బరిలోకి దించింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఏఐసీసీ జాతీయ అధికార ప్రతినిధి పవన్ ఖేడాతో పాటు కేంద్ర మాజీ మంత్రి రెహ్మాన్ ఖాన్ కుమారుడు మన్సూర్ అలీ ఖాన్‌లకు ఈసారి అదృష్టం వరించింది. ఈ ముగ్గురి పేర్లను ఖరారు చేస్తూ అధిష్ఠానం అధికారిక ప్రకటన విడుదల చేసింది. కాగా, అభ్యర్థిగా ఎంపికైన మల్లికార్జున్ ఖర్గే ఈరోజే తన నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక నామినేషన్ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఉప ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో పాటు పలువురు రాష్ట్ర, జాతీయ స్థాయి కీలక నేతలు హాజరై సంఘీభావం తెలపనున్నారు.
మరోవైపు, వైఎస్ షర్మిలకు ఈ దఫా కూడా రాజ్యసభ టికెట్ దక్కకపోవడంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ఆమె అనుచరులు, వైఎస్సార్ కాంగ్రెస్ అభిమానులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న షర్మిలకు పెద్దల సభలో అవకాశం కల్పిస్తారని వారంతా ఎంతో ఆశగా ఎదురుచూశారు. ముఖ్యంగా కర్ణాటక కాంగ్రెస్ నేతలతో ఉన్న సత్సంబంధాల రీత్యా అక్కడి నుంచి ఆమెకు లైన్ క్లియర్ అవుతుందని భావించినప్పటికీ, అధిష్ఠానం మాత్రం స్థానిక నేతలకే ప్రాధాన్యత ఇస్తూ తుది నిర్ణయం తీసుకుంది. దీంతో ఈసారికి షర్మిల పార్లమెంట్ కల నెరవేరకపోగా, ఆమె రాజకీయ ప్రయాణం ఏపీ అసెంబ్లీ, లోక్‌సభ వేదికగానే కొనసాగాల్సిన పరిస్థితి ఏర్పడింది

# చంద్రబాబు సైకిల్ సవారీ

- విశాఖ తీరంలో 5.5 కిలోమీటర్ల దూరం ఉత్సాహంగా ప్రయాణం.
- ఏయూ మైదానం నుంచి నోవాటెల్ వరకు సాగిన ర్యాలీ.
- ఎండను లెక్కచేయకుండా 21 నిమిషాల్లోనే ముగించిన సీఎం.
- పెద్ద ఎత్తున తరలివచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు.



**విశాఖపట్నం , మహా :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖపట్నంలో ఉత్సాహంగా సైకిల్ సవారీ చేశారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో నగరంలో నిర్వహించిన భారీ సైకిల్ ర్యాలీలో ఆయన స్వయంగా పాల్గొని అందరికీ ఆదర్శంగా నిలిచారు. నగరంలోని ఆంధ్ర యూనివర్సిటీ (ఏయూ) గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ హోటల్ వరకు జరిగిన ఈ ర్యాలీలో సీఎం ఆద్యంతం ఉత్సాహంగా ముందుకు సాగారు. మొత్తం 5.5 కిలోమీటర్ల సుదీర్ఘ దూరాన్ని ఆయన కేవలం 21 నిమిషాల 18 సెకన్ల వ్యవధిలోనే పూర్తి చేయడం విశేషం.
ఈ సైకిల్ యాత్ర ఏయూ మైదానంలో అత్యంత వైభవంగా ప్రారంభమైంది. అక్కడ నుంచి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, పోలమాంబ గుడి, వాల్తేరు జంక్షన్ మరియు ఆర్కే బీచ్ రోడ్డు మీదుగా సాగుతూ చివరికి నోవాటెల్ హోటల్ వద్ద ముగిసింది. ర్యాలీ సమయంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ, 70 ఏళ్ల వయసులోనూ చంద్రబాబు ఏమాత్రం అలసట చెందకుండా యువకుడిలా అత్యంత వేగంగా సైకిల్ తొక్కుతూ ముందుకు సాగారు. దారిపొడవునా రోడ్డుకు ఇరువైపులా నిలబడి హర్షధ్వానాలు చేస్తున్న అభిమానులకు, స్థానిక ప్రజలకు చిరునవ్వుతో అభివాదం చేస్తూ ఆయన తన ప్రయాణాన్ని కొనసాగించారు. ముఖ్యమంత్రి చేపట్టిన ఈ పర్యావరణ చైతన్య యాత్రలో విశాఖ జిల్లాకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని చంద్రబాబుతో కలిసి సైకిళ్లు తొక్కారు. పచ్చదనంపరిశుభ్రతతో పాటు శారీరక ఫిట్‌నెస్ కోసం, ఇంధన పొదుపు కోసం ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో సైక్లింగ్‌ను ఒక అలవాటుగా మార్చుకోవాలనే సందేశాన్ని ఈ ర్యాలీ ద్వారా చాటి చెప్పారు. విశాఖ తీర ప్రాంతంలో సాగిన ఈ వినూత్న కార్యక్రమం నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంది.

# అంబానీని వెనక్కి నెట్టిన టిక్‌టాక్ సృష్టికర్త

**ఢిల్లీ, మహా.** ఆసియా సంపన్నుల సామ్రాజ్యంలో సరికొత్త మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రముఖ వ్యాపార దిగ్గజం, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీని చైనాకు చెందిన 'టిక్‌టాక్' మాతృసంస్థ బైట్‌డాన్స్ వ్యవస్థాపకుడు ఝాంగ్ యిమింగ్ వెనక్కి నెట్టారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం.. ఝాంగ్ నికర ఆస్తి విలువ ఏకంగా 92.8 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.7.75 లక్షల కోట్లు) చేరింది. దీంతో ఇప్పటి వరకు రెండో స్థానంలో ఉన్న ముకేశ్ అంబానీ, 86.9 బిలియన్ డాలర్ల సంపదతో మూడో స్థానానికి పడిపోయారు. ఈ తాజా పరిణామంతో ఝాంగ్ యిమింగ్ ఆసియాలోనే రెండో అత్యంత ధనవంతుడిగా, చైనాలోనే నంబర్1 కుబేరుడిగా అవతరించారు. కాగా, ఈ ప్రతిష్టాత్మక జాబితాలో భారతదేశానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ 117.4 బిలియన్ డాలర్ల సంపదతో ఆసియా ఖండంలోనే అగ్రస్థానంలో కొనసాగుతున్నారు.
చైనాలోని ఫుజియాన్ ప్రాంతంలో జన్మించిన 43 ఏళ్ల ఝాంగ్ యిమింగ్ ప్రస్థానం నేటి యువతకు ఎంతో ఆదర్శప్రాయం. నాంకై విశ్వవిద్యాలయం నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఆయన, కెరీర్ ఆరంభంలో మైక్రోసాఫ్ట్ వంటి అంతర్జాతీయ సాంకేతిక దిగ్గజ సంస్థల్లో పనిచేశారు. ఆ తర్వాత 2012లో బీజింగ్‌లోని ఒక చిన్న అపార్ట్‌మెంట్ గది నుంచి 'బైట్‌డాన్స్' కంపెనీని ప్రారంభించారు. సాంప్రదాయ ఎడిటర్ల ప్రమేయం లేకుండా, కేవలం అత్యాధునిక అల్గారిథమ్స్ ఆధారంగా వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా కంటెంట్‌ను చేరవేసే 'టౌటియావో' అనే వినూత్న న్యూస్ ప్లాట్‌ఫామ్‌ను సృష్టించి తొలి విజయాన్ని అందుకున్నారు. ఆపై ఆయన రూపకల్పన చేసిన షార్ట్ వీడియో యాప్ 'టిక్‌టాక్' అంతర్జాతీయంగా వంద కోట్ల మందికి పైగా వినియోగదారులతో సోషల్ మీడియా ప్రపంచంలోనే సరికొత్త సంచలనం సృష్టించింది.ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా టిక్‌టాక్ సాధిస్తున్న అప్రతిహత విజయంతో పాటు, బైట్‌డాన్స్ సంస్థ ఇటీవల కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలోకి అడుగుపెట్టి రూపొందించిన 'దౌబావో' అనే ఏఐ చాట్‌బాట్ చైనా మార్కెట్లో అత్యంత ప్రజాదరణ పొందింది. ఈ అద్భుత విజయాల నేపథ్యంలో బ్లాక్‌రాక్, ఫిడిలిటీ వంటి అంతర్జాతీయ పెట్టుబడి సంస్థలు బైట్‌డాన్స్ మార్కెట్ విలువను భారీగా పెంచడంతో, ఝాంగ్ వ్యక్తిగత సంపద ఒకేసారి 24 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2 లక్షల కోట్లు) మేర వృద్ధి చెందింది. ఒకప్పుడు చమురు, రియల్ ఎస్టేట్, సంప్రదాయ ఉత్పాదక రంగాలు మాత్రమే కుబేరులను సృష్టిస్తే.. ప్రస్తుత ఏఐ యుగంలో కేవలం ఒక కోడింగ్ అల్గారిథమ్‌తో కూడా ప్రపంచ ఆర్థిక సామ్రాజ్యాన్ని శాసించవచ్చని ఝాంగ్ యిమింగ్ నిరూపించారని ఆర్థిక రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు

# ఎన్నికల పిటిషన్‌లు ఏళ్ళ తరబడి పెండింగ్

- సుప్రీంకోర్టుపై మద్రాస్ హైకోర్టు తీవ్ర అసంతృప్తి
- ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతమని వ్యాఖ్య

**చెన్నై, మహా :** ఎన్నికల ఫలితాలకు సంబంధించి కింది కోర్టు తీర్పుపై అప్పీల్ సుప్రీం కోర్టులో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటంపై మద్రాస్ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇలాంటి కేసుల్లో ఆరు నెలల్లోపు తీర్పు ఇవ్వాలని సుప్రీం స్వయంగా గతంలో జారీ చేసిన మార్గదర్శకాలను ప్రస్తావించింది. వీటికి సుప్రీం కోర్టు కట్టుబడకపోతే దేశంలో నిరంకుశత్వానికి దారితీస్తుందని వ్యాఖ్యానించింది. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే నేత ఇన్బదురై గెలుపును సవాలు చేస్తూ డీఎంకే నేత అప్పావు దాఖలు చేసిన కేసులో కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.
2016నాటి ఎన్నికల్లో ఇన్బదురై రాధాపురం నియోజకవర్గం నుంచి స్వల్ప మెజారిటీతో గెలిచారు. అయితే, ఈ ఫలితాన్ని అప్పావు మద్రాస్ హైకోర్టులో సవాలు చేశారు. పోస్టల్ బ్యాలెట్ పేపర్ల కౌంటింగ్‌లో అవకతవకలు జరిగాయని అన్నారు. మిడిల్ స్కూల్ హెడ్‌మాస్టర్లు అటెస్ట్ చేసిన పోస్టల్ బ్యాలెట్లు చెల్లవని అనడం నిబంధనలకు విరుద్ధమని వాదించారు. అప్పావు వాదనతో హైకోర్టు ఏకీభవించింది. మిడిల్ స్కూల్ హెడ్‌మాస్టర్లు కూడా గెజిటెడ్ ఆఫీసర్లేనని పేర్కొంది. వారు అటెస్ట్ చేసిన పోస్టల్ బ్యాలెట్‌లు చెల్లుతాయని పేర్కొంది. ఈ క్రమంలో న్యాయస్థానం ఆధ్వర్యంలోనే మూడు ఈవీఎంలలోని ఓట్ల రీకౌంటింగ్ జరిగింది. అయితే ఓట్ల కౌంటింగ్ ఫలితం వెలువడక ముందే ఇన్బదురై సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సర్వోన్నత న్యాయస్థానం హైకోర్టు తీర్పుపై స్టే విధించింది. అప్పీలుపై తుది తీర్పు మాత్రం దాదాపు ఆరేళ్ల పాటు పెండింగ్‌లో ఉండిపోయింది. ఇక మే 21న అప్పీలుపై విచారించిన సుప్రీం కోర్టు హైకోర్టు తీర్పుపై స్టేను ఎత్తేసింది. అయితే, 2016నాటి అసెంబ్లీ రద్దైపోయిన విషయాన్ని ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో కేసులోని న్యాయపరమైన వివాదంపై తీర్పు వెలువరించడం అనవసరమని చెబుతూ అప్పీలును క్లోజ్ చేసింది.
ఈ నేపథ్యంలో మద్రాస్ హైకోర్టు సుప్రీం కోర్టు తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎన్నికల వివాదాలను ఆరు నెలల్లోగా పరిష్కరించాలని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శకాలను ప్రస్తావించింది. ప్రజాప్రతినిధుల చట్టంలోని స్ఫూర్తికి కట్టుబడి ఉండకపోతే ప్రజాస్వామ్యం బలహీనమవుతుందని వ్యాఖ్యానించింది. అందరికీ ఓటు హక్కు ఉండాలన్న స్ఫూర్తి దెబ్బతింటుందని పేర్కొంది. రాజ్యాంగానికి రక్షణగా ఉండే న్యాయవ్యవస్థ ఇతర ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుంటూ అతిపెద్ద ప్రజాస్వామ్యం దేశంగా భారత్‌కు ఉన్న గౌరవాన్ని కాపాడాలని పేర్కొంది. ఇన్బదురై ఎన్నికను రద్దు చేస్తూ అప్పావును విజేతగా ప్రకటించింది. ఈ మేరకు అసెంబ్లీ రికార్డుల్లో ప్రతి చోటా మార్పులు చేయాలని అసెంబ్లీ సెక్రటరీని ఆదేశించింది.

# రెపో రేటు యథాతథం

- 5.25 శాతంగా కొనసాగింపు.
- ఆర్థిక వృద్ధి అంచనాలకు ఆర్‌బీఐ కోత.
- 6.6 శాతానికి పరిమితం.
- ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశంలో ఏకగ్రీవ నిర్ణయం.
- తక్కువ వర్షపాతం, ఎల్ నినో ప్రభావంతో ద్రవ్యోల్బణ ముప్పు.
- ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉన్నా సవాళ్లు తప్పవన్న గవర్నర్.

**ముంబై, మహా :**దేశీయ ఆర్థిక మార్కెట్ వర్గాల అంచనాలకు అనుగుణంగానే భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. పాలసీ రెపో రేటును 5.25 శాతం వద్దే యథాతథంగా కొనసాగించాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జూన్ 3 నుంచి 5 వరకు మూడు రోజుల పాటు ముమ్మరంగా సాగిన సమీక్షా సమావేశం అనంతరం ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఈ విధాన నిర్ణయాలను అధికారికంగా ప్రకటించారు. కేంద్ర బ్యాంక్ తీసుకున్న ఈ నిర్ణయంతో స్థిరాస్తి, వాహన రంగ రుణాలపై వడ్డీ రేట్లు ప్రస్తుతానికి స్థిరంగానే కొనసాగనున్నాయి. తాజా మార్పుల ప్రకారం స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ (ఎస్‌డీఎఫ్) రేటు 5 శాతంగాను, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (ఎంఎస్ఎఫ్) రేటుతో పాటు బ్యాంక్ రేటు 5.5 శాతంగాను యథాతథంగా కొనసాగుతాయని గవర్నర్ వివరించారు.
ఇదిలా ఉంటే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (ఎఫ్‌వై27) సంబంధించి దేశ జీడీపీ వృద్ధి అంచనాల్లో ఆర్‌బీఐ కోత విధించడం గమనార్హం. గతంలో వృద్ధి రేటు 6.9 శాతంగా ఉండొచ్చని అంచనా వేయగా, అంతర్జాతీయ పరిస్థితులను బేరీజు వేసుకుంటూ దానిని ఇప్పుడు 6.6 శాతానికి సవరించింది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అంతర్జాతీయ సరఫరా గొలుసులో తలెత్తుతున్న అంతరాయాలతో పాటు పెరుగుతున్న ముడిచమురు, ఇంధన ధరల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ వృద్ధి అంచనాలను తగ్గించాల్సి వచ్చిందని ఆర్‌బీఐ పేర్కొంది.
ద్రవ్యోల్బణ ఒత్తిళ్లపై గవర్నర్ సంజయ్ మల్హోత్రా దేశ ఆర్థిక వ్యవస్థను హెచ్చరించారు. ప్రస్తుతం రిటైల్ ద్రవ్యోల్బణం (సీపీఐ) నియంత్రణలోనే ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ, రాబోయే మూడో త్రైమాసికం నాటికి ఇది ఆర్‌బీఐ నిర్దేశించుకున్న గరిష్ఠ సహన పరిమితికి చేరే ప్రమాదం ఉందని అంచనా వేశారు. ముఖ్యంగా ఈ ఏడాది దేశంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు కనిపిస్తుండటం, ఎల్ నినో ప్రభావం తీవ్రతరం కానుండటం వంటి అంశాలు ఆహార ద్రవ్యోల్బణానికి దారితీసే ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, కోర్ ద్రవ్యోల్బణం 3.7 శాతం వద్ద స్థిరంగా కొనసాగుతుండటం దేశీయ మార్కెట్లకు కొంత ఊరటనిచ్చే అంశమని అభిప్రాయపడ్డారు.
ప్రస్తుత అంతర్జాతీయ సవాళ్లు, అనిశ్చితుల మధ్య కూడా భారత ఆర్థిక వ్యవస్థ అత్యంత స్థితిస్థాపకంగా, బలంగా ముందుకు సాగుతోందని గవర్నర్ ధీమా వ్యక్తం చేశారు. దేశీయంగా ప్రైవేట్ వినియోగం పెరగడం ఆర్థిక వృద్ధికి అండగా నిలుస్తోందని, ఐటీ రంగానికి ఊతమిస్తూ సేవల ఎగుమతులు బలంగా సాగుతున్నాయని కొనియాడారు. వస్తు ఎగుమతులు కూడా ఆశాజనకమైన వృద్ధిని నమోదు చేస్తున్నప్పటికీ, అంతర్జాతీయంగా పెరుగుతున్న నిర్వహణ వ్యయాల ఒత్తిడి వివిధ రంగాలపై ప్రభావం చూపుతోందని, ఈ పరిణామాలను ఆర్‌బీఐ నిరంతరం నిశితంగా గమనిస్తోందని స్పష్టం చేశారు.

# ఎంఎంటీఎస్ లో నో ఫ్రీ జర్నీ

**పాత బకాయిలు చెల్లించాలని సూచన**

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ, కాలుష్యాన్ని తగ్గించి ప్రజా రవాణాను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం తీసుకునన కీలక నిర్ణయానికి రైల్వో బోర్డు నో చెప్పింది. నగరంలో పేద, మధ్యతరగతి ప్రజలకు చౌకైన ప్రయాణ సాధనంగా ఉన్న మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ (ఎంఎంటీఎస్) రైళ్లలో అందరికీ ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని రేవంత్ సర్కార్ భావించింది. ఈ పథకాన్ని జూన్ 2వ తేదీ (రాష్ట్ర అవతరణ దినోత్సవం) నుంచి అమలు చేయాలనే ఆలోచనతో, ప్రయాణికుల టికెట్ ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని పేర్కొంటూ ఒక ముసాయిదా అవగాహన ఒప్పందాన్ని, ప్రతిపాదనను రైల్వే బోర్డు పరిశీలన కోసం పంపింది.
అయితే, తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనకు రైల్వే బోర్డు రెడ్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం ఎంఎంటీఎస్ సేవలు భారీ నష్టాలతో నడుస్తున్న నేపథ్యంలో ఈ ఉచిత ప్రయాణాన్ని అమలు చేయడం సాధ్యం కాదని స్పష్టం చేస్తూ రైల్వే బోర్డు ఈ ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించింది. ఒకవేళ ఈ ఉచిత ప్రయాణ పథకాన్ని కచ్చితంగా అమలు చేయాలని భావిస్తే దానికి సంబంధించిన పూర్తి ఆర్థిక భారాన్ని మోసేందుకు సిద్ధంగా ఉండాలని, ఉచిత ప్రయాణం వల్ల వచ్చే నష్టాల మొత్తాన్ని 100 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని లిఖితపూర్వకంగా హామీ ఇస్తేనే అంగీకరిస్తామని రైల్వే అధికారులు తేల్చిచెప్పారు.ఈ సందర్భంగా ఎంఎంటీఎస్ ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభాన్ని రైల్వే అధికారులు లెక్కలతో సహా లేఖలో వివరించారు. ఎంఎంటీఎస్ సర్వీసుల నిర్వహణ ఇప్పటికే రైల్వేలకు భారీ భారంగా మారిందని, 202425 ఆర్థిక సంవత్సరంలో దీని నిర్వహణకు రూ.179 కోట్ల వరకు ఖర్చు కాగా, ప్రయాణికుల నుండి వచ్చిన ఆదాయం కేవలం రూ.16.81 కోట్లేనని వెల్లడించారు. అంటే ఒక్క ఏడాదిలోనే దాదాపు రూ.160 కోట్ల నుండి రూ.162 కోట్లకు పైగా వార్షిక నష్టం వచ్చినట్లు స్పష్టం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉచిత ప్రయాణాన్ని అమలు చేస్తే నష్టాలు మరింత పెరిగే అవకాశం ఉందని బోర్డు అభిప్రాయపడింది. నష్టాల అంశంతో పాటు ఎంఎంటీఎస్ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన పాత పెండింగ్ బకాయిల అంశాన్ని కూడా రైల్వే బోర్డు లేఖలో ప్రస్తావించింది.
ఎంఎంటీఎస్ ప్రాజెక్ట్ ఫేజ్ 2 కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా ఇంకా సుమారు రూ. 460 నుండి రూ. 490 కోట్ల వరకు బకాయిలు రావాల్సి ఉందని అధికారులు తెలిపారు. పూర్తి స్థాయి ఆర్థిక హామీలతో పాటు, ముందుగా ఈ పెండింగ్ బకాయిలను చెల్లించాలని, అప్పుడే ఉచిత ప్రయాణ పథకాన్ని పరిశీలిస్తామని రైల్వే బోర్డు కఠినమైన షరతు విధించింది. మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉచిత ప్రయాణ ప్రతిపాదన కోసం దక్షిణ మధ్య రైల్వేకు ఏడాదికి రూ. 10 కోట్లు చెల్లించేందుకు ముందుకు వచ్చినప్పటికీ, రైల్వే బోర్డు విధించిన అదనపు నష్టపరిహార షరతుల వల్ల ఈ ప్రతిపాదన ప్రస్తుతానికి నిలిచిపోయింది. రైల్వే బోర్డు నుంచి వచ్చిన ఈ సమాచారాన్ని రాష్ట్ర ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. పూర్తి స్థాయి ఆర్థిక భరోసా, పాత బకాయిల చెల్లింపులపై స్పష్టత వస్తేనే ఈ ప్రాజెక్ట్ ముందడుగు పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ తదుపరి కార్యాచరణకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలోనే ఢిల్లీ వెళ్లే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌కు సంబంధించిన పలు కీలక రైల్వే, మెట్రో విస్తరణ ప్రాజెక్టులతో పాటు ఈ ఎంఎంటీఎస్ ఉచిత ప్రయాణ ప్రతిపాదన అంశాన్ని కూడా కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సీఎం చర్చించే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

# అగ్గి.. బుగ్గి..



మంటలు... ఆరని మంటలు. హడలెత్తిస్తున్న ఘటనలు... అగ్నికి ఆహుతి అవుతున్న జనాలు. బుగ్గి పాలవుతున్న కోట్ల రూపాయల సంపద. ఇది ఇప్పుడు దేశంలో నిత్యం జరుగుతున్న ఘోరకలి. ఈ వేసవిలో రికార్డ్ స్థాయిలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోవటం కలవరం రేపుతోంది. ప్రమాదాల వెనుక అసలు కారణం మాత్రం నిర్లక్ష్యమే... అదే నిప్పుగా మారి పెను ముప్పు తెచ్చి పెడుతోంది... దేశంలో ప్రతీ రోజు అగ్ని ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. అన్నింటికీ ఒక్కటే కారణంగా అధికారులు చెప్పటం పరిపాటిగానూ మారుతోంది... అదే షార్ట్ సర్క్యూట్. అంటే మానవ తప్పిదం ఏమి లేదని... ఇట్టే చెప్పేస్తున్నారు... నిజానికి ప్రతీ అగ్ని ప్రమాదం వెనుక మానవ తప్పిదం ఉందన్నది కాస్త ఆలోచించే వారికి ఇట్టే అర్థం అవుతుంది. ఈ వేసవిలో ఎండలు మండిపోతున్నాయి. 47 డిగ్రీలను మించిన వేసవి తాపం ప్రజలకు ముచ్చేమటలు పట్టించి ముప్పతిప్పలు పెడుతున్నాయి. ఉపశమనం కోసం ఫ్యాన్, ఏసీ వాడకం తప్పని సరి అయింది. ఇదే పెద్ద ప్రమాదాలకు కారణం అవుతోంది. విరామం లేకుండా వాడే ఫాన్స్, ఏసీ ల వల్ల మంటలు పుట్టుకు వచ్చి చూస్తుండగానే పెను ప్రమాదాలు తెచ్చి పెడుతున్నాయి. పరిస్థితి అర్థం చేసుకునేలోగానే జరగవల్సిన అనర్థం జరిగితూనే వుంది. ఈ ఏడాది వేసవి కాలం దేశ వ్యాప్తంగా వేల సంఖ్యలో అగ్ని ప్రమాదాలు జరిగాయి. లక్షల కోట్ల ఆస్తులు బుగ్గి అయ్యాయి. ఇక అగ్ని ప్రమాదాల లో వేయి మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 38 వేల మందికి పైగా గాయపడ్డారు. వంట గ్యాస్ సిలిండర్ల పేలుళ్ళు కూడా ఇందులో వున్నాయి.ప్రతీ అగ్ని ప్రమాదం వెనుక నిర్లక్ష్యం ఉండటం గమనార్హం.

ప్రపంచం ఇప్పుడు ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం వైపు పరుగులు తీస్తోంది. సమాచార విస్ఫోటనంతో ఎక్కడ ఏం జరిగినా క్షణాల్లో అందరికి తెలిసిపోతోంది. ఇంతగా మేధో వికాసం ఇప్పుడు పరుగులు తీస్తున్నా చిన్న చిన్న విషయాలను మాత్రం మనుషులు పట్టించుకోవటం లేదు. అదే ముప్పుగా మారుతోంది. వేసవి కాలం వస్తోంది అంటే అది అగ్ని ప్రమాదాలకు ఓ సంకేతమని, ఏ మాత్రం అలక్ష్యంగా వున్నా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని అందరికి తెలుసు. అయినా ఈ విషయం అంత సీరియస్ గా ఎవ్వరు పట్టించుకోవటం లేదు. 24 గంటలు ల్యాబ్ ట్యాప్ లు, కంప్యూటర్ల వినియోగించుకునే రోజులు ఇవి. వాటిని కూల్ గా ఉంచేందుకు ఏసీ తప్పని సరి. ఇక ఫ్యాన్ స్విచ్ వేయటం తప్ప ఆఫ్ చేయటం అలవాటు లేని వారు ప్రతీ వంద మందిలో 90 మంది వున్నారని ఓ సర్వే చెప్పిన మాటలు వింటే ఆశ్చర్య పడక తప్పదు మరి. ఇంట్లో ఎవ్వరు లేక పోయినా వెలిగే లైట్లు, తిరిగే ఫాన్స్, మోగే టీ వీ ల సంఖ్య దేశంలో ఎనిమిది నించి 15 శాతం మేరకు చేరిందట... సెల్ ఫోన్ కు ఛార్జింగ్ పెట్టి చార్జ్ అయిన తర్వాత స్విచ్ ఆఫ్ చేయని వారి సంఖ్య దేశంలో 78 శాతం మేరకు ఉందంటే మన వారిలో నిర్లక్ష్యం ఎంతగా పేరుకు పోయిందో అర్థం చేసుకో వచ్చు... సెల్ ఫోన్ చార్జింగ్ లో పెట్టి మాట్లాడటం ప్రమాదమని తెలిసి కూడా దాన్ని కొనసాగిస్తున్న వారి సంఖ్య దేశంలో 22 శాతం మేరకు వుందని ఓ సర్వే తేల్చి చెప్పింది... ఇలాంటి చిన్న తప్పిదాలు వెరసి భారీ అగ్ని ప్రమాదాలకు కారణం అవుతూనే వున్నాయి.

విద్యుత్ వాడకం పై మన దేశంలో అవగాహన చాలా తక్కువగా ఉందని న్యూయార్క్ టైమ్స్ స్పష్టంగా చెప్పింది... ప్రతీ మూడేళ్లకు ఓ సారి ప్రతీ విద్యుత్ కనెక్షన్ కు సంబందించిన పర్యవేక్షణ తప్పనిసరిగా చెప్పుకొచ్చిన న్యూయార్క్ టైమ్స్ ఇండియాలో ఇది మచ్చికైనా లేదని చెప్పేసింది. విద్యుత్ వాడకం కోసం ఏళ్ల క్రితం వేసిన వైరింగ్ పట్టించుకునే వారే వుండరు. ఇక అదే పనిగా విద్యుత్ వాడుతూ ప్రమాదా లకు ఆస్కారం ఇచ్చే వారు చాలా మందే వున్నారు. ఇక ఘోరం జరిగినప్పుడు మాత్రమే స్పందించే అధికారులు సరేసరి. ప్రస్తుతం దేశంలోఈ ఏడాది జరిగిన అగ్ని ప్రమాదాలు భవిష్యత్ లో జరగబోయే ఘోర ప్రమాదాలకు ఓ హెచ్చరికగా నిపుణులు చెప్పుకుని వస్తున్నారు. ముఖ్యంగా దేశంలో ఇప్పుడు నగరాలు శర వేగంగా విస్తరిస్తున్నాయి. బహుళ అంతస్థులు పెరిగిపోతున్నాయి. వీటిల్లో నివాసం వుండే వారి సంఖ్య పెరుగుతోంది. ఇటు వ్యాపారం, వాణిజ్య, పరిశ్రమ రంగాలు వృద్ధి చెందు తున్నాయి. మనిషి నిలబడే స్థలం ఉంటే చాలు. ఆ స్థలంలోనే వ్యాపారం చేసే పరిస్థితి ఇప్పుడు వుంది. ఇదే నేపథ్యంలో విద్యుత్ వినియోగించుకునే వారి సంఖ్య అపరిమితం అవుతోంది... దీన్ని దృష్టిలో పెట్టుకొని ఇప్పుడు అగ్ని మాపక సంస్థ మరింత బాధ్యతయుతంగా అడుగులు వేయాలి. ముఖ్యంగా అత్యంత బహుళ అంతస్థుల నిర్మాణం సమయంలోనే అగ్ని ప్రమాద రహిత వ్యవస్థల ఏర్పాటు పై దృష్టి పెట్టాలి. ప్రమాదం జరిగిన ప్రాణనష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలను నిశితంగా పరిశీలన చేయాల్సిందే. అప్పుడే అనుమతులు ఇవ్వాలి.. ఇదే విధంగా వ్యాపార, వాణిజ్య, పరిశ్రమల విషయంలోనూ సంబంధిత అధికారులు గట్టిగా వ్యవహరించ వల్సిందే. ఇందులో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించిన ఢిల్లీ హోటల్ ఘటన, హైదరాబాద్ అమీరుపేట ఘటనల వంటివి మళ్ళీ, మళ్ళీ పునరావృతం అవుతూనే ఉంటాయి. నిప్పుతో చెలగాటం ఎప్పటికి అయినా ముప్పేనని ప్రజలను పదే పదే అప్రమత్తం చేయాల్సిన అవసరం ఇప్పుడు కనిపిస్తోంది... కించిత్తు జాగ్రత్త అనేక అనర్థాలకు అడ్డు గోడగా నిలుస్తుంది. బాధ్యతగా ఉందాం. నిప్పు ముప్పును తప్పించుకుందాం.



జీ. వెంకటరమణ
సీనియర్ జర్నలిస్ట్

# అన్నదాతకు ఆగచాట్లు

పలావ్ సూపర్ గా వుంది. బగారా కర్రీ భలే టెస్ట్ భేష్. పులిహోర రుచి అద్భుతం. టమాట పప్పు అహో అన్పించింది. అన్నదాత సుఖీభవ. రుచిగా, తృప్తిగా భోజనం చేసినప్పుడు మనం అనుకునే మాటలు ఇవి. కానీ మనకు కడుపు నిండా భోజనం తినే అవకాశం ఇస్తున్న రైతును మాత్రం ససేమిరా గుర్తు చేసుకోం. అసలు ఆ ప్రస్తావనే రాదు. రోజు మనం అన్నం తింటున్నాం... చేతులు కడిగేసుకుంటున్నాం... మరి కంచంలోకి ఆ ముద్ద తెచ్చే వరకు శ్రమించిన రైతు గురించి ఏ మాత్రం ఆలోచించం.. ఇది మానవ నైజం. ఆరుగాలం శ్రమించి, తన కష్టంతో రైతు పండించే ధాన్యమే మన కడుపు నింపి ఆకలి బాధ తీరుస్తోంది. ఇది అందరికి తెలిసిన నిజమే... ఒక్క క్షణం రైతు కష్టం గురించి ఆలోచిస్తే మాత్రం మనం తినే ప్రతీ ముద్దకు ఆ రైతుకు దండం పెట్టాల్సిందే. కాలం మారినా, తరాలు మారినా, చివరికి ప్రభుత్వాలు, పాలకులు మారినా అన్నదాత బతుకులు మాత్రంఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగానే వుంది... వ్యవసాయం చేసి బాగు పడిన రైతులు కేవలం పదుల సంఖ్యలో మాత్రమే వుంటున్నారు అన్నది పచ్చి నిజం. అన్నదాతల కోసం అది చేస్తున్నాం, ఇది ఇస్తున్నాం అంటూ పాలకులు పదే పదే చెప్తున్నా మాటలు కోటలు దాటు తూనే వున్నాయి. క్షేత్ర స్థాయిలో రైతుల దీనస్థితి ఇప్పటికి మారలేదు... వ్యవసాయం అంటే అదృష్టం అనే పరిస్థితి ఇప్పుడు రైతుకు తప్పట్లేదు... ఇటు ఖరీఫ్, అటు రబీ సీజన్ వస్తోంది అంటే భుజాన నాగలి వేసుకొని రైతు పొలం బాట పడుతున్నాడు. ప్రతీ ఏడాది ఓ కొత్త ఆశతో పొలం పనులు మొదలు పెడుతున్న అన్నదాతకు వరుణుడు శత కోటి పరీక్షలు పెడుతూనే వున్నాడు... వర్షాకాలం వస్తోంది అంటే దుక్కిదున్నీ పంట కోసం పొలం సిద్ధం చేస్తున్న రైతులు చినుకుల కోసం ఆకాశం వైపు చకోర పక్షి లాగా ఎదురు చూడక తప్పట్లేదు... ఇక అతివృష్టి, అనావృష్టిలు అన్నదాతను వీడవ టమే లేదు... అయినా మొక్కవోని ధైర్యంతో రైతు వ్యవసాయం చేస్తూనే వున్నాడు... ఇప్పుడు వ్యవసాయ రంగంలో తెలంగాణ రైతులు సత్తా చాటుతున్న తీరు ఇక్కడ చెప్పుకోవల్సిందే.

భూమిని నమ్ముకున్న వాళ్ళు ఎప్పటికి చెడిపోరు అన్న పెద్దల మాటలు ఇప్పుడు తెలంగాణ రైతులు నిజం చేసి చూపిస్తున్నారు. తెలంగాణ అంటే కరువు ప్రాంతం... అక్కడ పొలాన్ని నమ్ముకోవటం కన్నా అమ్ముకోవటం బెస్ట్ అంటూ ఒకప్పుడు ఎగతాళి చేసిన వారు లేకపోలేదు. కానీ ఇప్పుడు ఏకంగా 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించిన తెలంగాణ రైతులు తమను చూసి నవ్విన వారికి ధాన్య రాసులు కుప్పలుగా పోసి సమాధానం ఇచ్చిన తీరు మరువ లేనిది. వరి, జొన్న, మొక్కజొన్న, వేరు సెనగ, చివరికి నూనె ధాన్యాల పంటలతో ఇప్పుడు తెలంగాణ రైతు ముందు వరుసలో నిలిచిన తీరు అబ్బుర పరుస్తోంది. ఇంతలో ఎంత మార్పు... నవ్విన నాప చేను పండింది... అన్న సామెత ఇప్పుడు తెలంగాణలో నిజం అయింది. అంతా బాగానే వుంది... రైతు పరిస్థితే ఇబ్బందిగా వుంది... పంట పండిన దాన్ని అమ్మేందుకు ఆగచాట్లు తప్పట్లేదు. మార్కెట్ లో పడిగాపులు పడే దుస్థితి మారటం లేదు... ధాన్యం కుప్పల మీదే రైతుల ప్రాణాలు పోతున్న ఘటనలు ఆవేదన, ఆందోళన కలిగిస్తూనే వున్నాయి. మరో వైపు మార్కెట్ మాయజాలం రైతును నిలువు దోపిడీ చేస్తూనే వున్నాయి... మార్కెట్ లో గిట్టుబాటు ధరలు అన్నదాత వెన్ను విరుస్తూనే వున్నాయి. తరుగు, నాణ్యత అంటూ దెబ్బ తీసే పరిస్థితి కొనసాగుతూనే వుంది... ఇది చాలదు అన్నట్టు అకాల వర్షాలు రైతును నిండా ముంచుతూనే వున్నాయి.

వ్యవసాయం మొదలు పెట్టిన తొలి రోజు నుంచే రైతుకు సమస్యలు మొదలు అవుతున్నాయి. కూలీల కొరత, విత్తనాలు కొరత వేదిస్తూనే వెంటాడుతున్నాయి... ఇక పెట్టుబడులు కోసం అవస్థలుపడుతునే వున్నారు... సకాలంలో బ్యాంకులు రుణాలు ఇవ్వని పరిస్థితి. ఇక ప్రైవేట్ వ్యక్తుల నుంచే రైతు అధిక వడ్డీలు చెల్లించి డబ్బులు తెచ్చుకోక తప్పట్లేదు. యూరియా కోసం రైతులు నిద్ర లేని రాత్రులు గడపటం చూస్తూనే వున్నాం. మార్కెట్ లో నకిలీ విత్తనాల బెడద రైతుకు శాపంగానే వుంది. అన్ని అడ్డంకులు దాటి ఎట్టకేలకు పంట పండిస్తే గిట్టుబాటు ధరలు చూసి రైతు చేష్టలుడిగి పోతూనే వున్నాడు. ఇవి చాలవు అన్నట్టు ఇప్పుడు భారత వాతావరణ శాఖ పిడుగులాంటి వార్త ఒకటి చెప్పుకువచ్చింది. అదే ఎల్ నినో. ఈ ఏడాది కరువు తప్పదు అంటూ చావు కబురు చల్లగా చెప్పేసింది. రైతు ఆశలపై నీళ్లు చల్లేసింది. ఈ ఏడాది సాధారణ వర్షాలు కూడా పడటం కష్టమంటూ నిపుణులు కూడా అంటున్నారు. ఇదే ఇప్పుడు రైతుకు పెద్ద దిగులుగా మారింది. ఇక ఇప్పుడు కేంద్రం, రాష్ట్రం ఏం చేయబోతున్నాయి. రైతులకు అది చేస్తాం, ఇది చేస్తాం. మాది రైతు పక్షపాత ప్రభుత్వం అంటూ చెప్పుకునే ప్రభుత్వాలు ఇప్పుడు రైతును ఎలా ఆదుకుంటాయి. ఇప్పటి వరకు అయితే వచ్చే సంక్షోభం పై ప్రభుత్వాలు ఎలాంటి ప్రకటనలు చేయలేదు. ముున్ముందు ఏం చేస్తాయో తెలీదు. కరువు పరిస్థితి వస్తే రైతును ఎలా ఆదుకుంటాయి... రైతు కుటుంబం ఎలా బతుకు సాగిస్తుంది..ఇదే ఇప్పుడు ఓ పెద్ద సవాల్. ప్రభుత్వాలు ఇప్పటి నుంచే కరువును ఎదురుకునేందుకు సన్నద్ధం కావాలి... లేకపోతే ఇక్కట్లు తప్పవు... అన్నదాతకు ఆగచాట్లు వీడవు.

**జీ. వెంకటరమణ...**
**సీనియర్ జర్నలిస్ట్...**



# ఉసిరి యొక్క అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు

ఉసిరి చిన్న పండు అయినప్పటికీ ఆరోగ్యానికి ఎంతో మేలును అందించే సహజ ఔషధంగా భారతీయ సంప్రదాయంలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. భారతీయ గూస్బెర్రీగా పిలువబడే ఈ పండు శతాబ్దాలుగా ఆయుర్వేద వైద్యంలో విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. పోషక విలువలు సమృద్ధిగా ఉండటం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఇది ఒక సూపర్ ఫుడ్గా గుర్తింపు పొందింది. రోజూ ఆహారంలో కొద్దిపాటి ఉసిరి చేర్చడం ద్వారా శరీరానికి అవసరమైన అనేక ముఖ్యమైన పోషకాలు అందుతాయి. ముఖ్యంగా రోగనిరోధక శక్తిని పెంచడం, జీర్ణక్రియను మెరుగుపరచడం, చర్మం మరియు జుట్టు ఆరోగ్యాన్ని కాపాడడం వంటి అనేక ప్రయోజనాలను ఉసిరి అందిస్తుంది.



ఉసిరి పోషక విలువల పరంగా ఎంతో ప్రత్యేకమైనది. ఇందులో విటమిన్ సి అత్యధికంగా ఉండటం దీనికి ప్రధాన కారణం. 100 గ్రాముల ఉసిరిలో ఉండే విటమిన్ సి పరిమాణం అనేక ఇతర పండ్ల కంటే ఎక్కువగా ఉంటుంది. కొన్నిసార్లు ఇది 193 నుండి 720 మిల్లీగ్రాముల వరకు ఉండవచ్చు. దీనివల్ల శరీరానికి అవసరమైన యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఉసిరిలో కార్బోహైడ్రేట్లు, ఫైబర్, ప్రోటీన్ మరియు కొద్దిపాటి కొవ్వు కూడా ఉంటాయి. అదనంగా విటమిన్ ఎ, విటమిన్ బి సమూహం, విటమిన్ ఈ, కాల్షియం, ఐరన్, ఫాస్పరస్ వంటి ఖనిజాలు కూడా ఇందులో లభిస్తాయి. ఇవన్నీ కలిసి శరీర ఆరోగ్యాన్ని సమతుల్యంగా నిలబెట్టడంలో సహాయపడతాయి. ముఖ్యంగా ఇందులో ఉండే ఫ్లేవనాయిడ్లు, పాలీఫెనాల్స్ వంటి యాంటీఆక్సిడెంట్ సమ్మేళనాలు శరీరాన్ని వివిధ రకాల వ్యాధుల నుండి రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

రోజువారీ జీవితంలో ఉసిరి తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. విటమిన్ సి సమృద్ధిగా ఉండటం వల్ల శరీర రోగనిరోధక శక్తి బలపడుతుంది. దీనివల్ల జలుబు, దగ్గు వంటి సాధారణ ఇన్ఫెక్షన్లను ఎదుర్కొనే శక్తి పెరుగుతుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో కూడా ఉసిరి సహాయపడుతుంది. రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో, ట్రైగ్లిజరైడ్స్ను నియంత్రించడంలో ఇది ప్రభావవంతంగా పనిచేస్తుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అలాగే రక్తపోటును నియంత్రించడంలో కూడా ఉసిరి పాత్ర ఉందని నిపుణులు చెబుతున్నారు.

చర్మ ఆరోగ్యానికి కూడా ఉసిరి ఎంతో మేలు చేస్తుంది. విటమిన్ సి కారణంగా కొల్లాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది. దీని వల్ల చర్మం దృఢంగా ఉండటంతో పాటు వృద్ధాప్య లక్షణాలు ఆలస్యంగా కనిపిస్తాయి. చర్మం మెరుస్తూ ఉండేందుకు ఇది సహాయపడుతుంది. అదే విధంగా జుట్టు ఆరోగ్యానికి కూడా ఉసిరి ఎంతో ఉపయోగకరంగా భావిస్తారు. జుట్టు రాలడం తగ్గించడం, జుట్టు వేర్లను బలపరచడం, తల చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడం వంటి ప్రయోజనాలు అందిస్తుంది. అందుకే అనేక హెయిర్ ఆయిల్స్, హెయిర్ కేర్ ఉత్పత్తుల్లో ఉసిరిని ప్రధాన పదార్థంగా ఉపయోగిస్తారు.

జీర్ణక్రియను మెరుగుపరచడంలో ఉసిరి ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఇందులో ఉండే ఆహార ఫైబర్ ప్రేగుల కదలికలను సవ్యంగా ఉంచి మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది. శరీరంలో విషపదార్థాలను తొలగించడంలో కూడా ఇది సహాయపడుతుంది. కాలేయ ఆరోగ్యాన్ని కాపాడటంలో కూడా ఉసిరి సహకరిస్తుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. కాలేయ పనితీరును మెరుగుపరచడంలో ఇది సహాయపడుతుందని పరిశోధకులు పేర్కొంటున్నారు.

మధుమేహం ఉన్నవారికి కూడా ఉసిరి కొంతవరకు ప్రయోజనకరంగా ఉండవచ్చు. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. అలాగే మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడటంలో కూడా ఉసిరి పాత్ర ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి. శరీర బరువును నియంత్రించాలనుకునే వారికి కూడా ఉసిరి ఉపయోగపడుతుంది. ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల ఎక్కువ సేపు తృప్తి భావం కలుగుతుంది. దీంతో అధికంగా ఆహారం తీసుకునే అవకాశం తగ్గుతుంది.

కంటి ఆరోగ్యానికి కూడా ఉసిరి మేలు చేస్తుంది. ఇందులో ఉండే కెరోటిన్ కంటి చూపును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. వయస్సు పెరిగే కొద్దీ వచ్చే కంటి సమస్యలను తగ్గించడంలో కూడా ఇది సహకరిస్తుంది. అంతేకాకుండా ఉసిరిలో ఉండే సహజ శోథ నిరోధక లక్షణాలు శరీరంలోని వాపును తగ్గించడంలో సహాయపడతాయి. కీళ్ళ నొప్పులు వంటి సమస్యలతో బాధపడుతున్న వారికి కూడా ఇది కొంత ఉపశమనాన్ని అందిస్తుంది. మెదడు ఆరోగ్యానికి కూడా ఉసిరి ఉపయోగకరమని నిపుణులు చెబుతున్నారు. యాంటీఆక్సిడెంట్లు మెదడును ఆక్సీకరణ నష్టాల నుండి రక్షించి జ్ఞాపకశక్తిని మెరుగుపరచడంలో సహాయపడతాయి.

ఉసిరిని రోజువారీ ఆహారంలో అనేక విధాలుగా తీసుకోవచ్చు. పచ్చిగా తినడం, రసం రూపంలో తీసుకోవడం, ఊరగాయలు లేదా చట్నీలు తయారు చేయడం వంటి పద్ధతులు ఉన్నాయి. కొంతమంది దీనిని పప్పులు లేదా కూరల్లో కూడా ఉపయోగిస్తారు. ఆయుర్వేద వైద్యంలో కూడా ఉసిరికి ఎంతో ప్రాధాన్యం ఉంది. చ్యవన్‌ప్రాష్ వంటి ప్రసిద్ధ ఆయుర్వేద ఔషధాలలో ఇది ప్రధాన పదార్థంగా ఉపయోగిస్తారు.

అయితే ఏ ఆహారం మాదిరిగానే ఉసిరిని కూడా మితంగా తీసుకోవడం అవసరం. అధికంగా తీసుకుంటే కొన్ని దుష్ప్రభావాలు కలగవచ్చు. ఇందులో ఉండే అధిక ఫైబర్ కారణంగా కొందరికి కడుపు ఉబ్బరం, నొప్పి లేదా విరేచనాలు రావచ్చు. అలాగే ఇది రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించే లక్షణం కలిగి ఉండటంతో మధుమేహం మందులు తీసుకునేవారు జాగ్రత్తగా ఉండాలి. తక్కువ రక్తపోటు ఉన్నవారు కూడా ఉసిరి ఎక్కువగా తీసుకోవడం నివారించాలి. ఉసిరి ఆమ్ల స్వభావం కలిగి ఉండటం వల్ల కొందరికి కడుపులో ఆమ్లత్వం లేదా చికాకు కలిగే అవకాశం ఉంటుంది.

సరైన మోతాదులో ఉసిరిని ఆహారంలో చేర్చుకుంటే ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. మన పూర్వీకులు చెప్పినట్లుగా ప్రకృతిలో లభించే ఈ చిన్న పండు అనేక ఆరోగ్య సమస్యలకు సహజ పరిష్కారంగా నిలుస్తుంది. రోజువారీ ఆహారంలో కొద్దిపాటి ఉసిరి చేర్చడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.





# పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత..

**మణుగూరు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కంబపు సూరి రెడ్డి..**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కోర్టు ఆవరణలో మొక్కలు నాటిన జడ్జి, న్యాయవాదులు..

మణుగూరు, మహా : పర్యావరణ పరిరక్షణ మన హక్కు మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి రాజ్యాంగ బద్ధమైన బాధ్యత అని న్యాయమూర్తి కంభపు సూరి రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మణుగూరు కోర్టు ఆవరణలో నిర్వహించిన మొక్కల నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ(జి) ప్రకారం ప్రకృతి, అడవులు, నదులు, సరస్సులు, వన్యప్రాణులను సంరక్షించి అభివృద్ధి చేయడం ప్రతి పౌరుడి ప్రాథమిక విధి అని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ చట్టం, అటవీ సంరక్షణ చట్టం, వన్యప్రాణి సంరక్షణ చట్టం వంటి చట్టాల ప్రధాన ఉద్దేశ్యం ప్రకృతి సంపదను కాపాడటమేనని పేర్కొన్నారు. మొక్కలు మనకు ప్రాణవాయువును అందించడమే కాకుండా వాతావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. పెరుగుతున్న కాలుష్యం, భూతాపం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా వాటిని పెద్ద చెట్లుగా పెంచినప్పుడే పర్యావరణ పరిరక్షణ లక్ష్యం సాకారమవుతుందని అన్నారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని బాధ్యతగా సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొట్టే అజయ్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురు కృష్ణ, ప్రధాన కార్యదర్శి వీర మధుసూదన్, మండల న్యాయ సమితి న్యాయవాది పద్మావతి, న్యాయవాదులు కందిమల్ల నరసింహారావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, గద్దల సాంబ, వాసవి, కోర్ట్ సూపరింటెండెంట్ డికొండ రవికుమార్, ఎంఎల్ ఎస్ సి రవీందర్, సిబ్బంది లక్ష్మి ప్రసన్న, నరేందర్, అటవీ శాఖ అధికారులు ఎఫ్ డి ఓ బాబు, ఎఫ్ ఆర్ ఓ ఉపేందర్, స్నేహలత, మొహమ్మద్ సత్తాజలి తదితరులు పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించారు.

# బూర్గంపహాడ్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

- 11 మంది పట్టుబడ్డారు – 9 మందికి జరిమానా, ఇద్దరికి జైలు శిక్ష
- ఎస్ఐ మేడా ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్

**బూర్గంపహాడ్, మహా :** బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ మేడా ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 11 మంది వ్యక్తులను పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఈ ప్రత్యేక తనిఖీలు బూర్గంపహాడ్ ప్రాంతంలో విస్తృతంగా నిర్వహించారు.పట్టుబడిన 11 మందిని శుక్రవారం భద్రాచలం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో జడ్జి శివ నాయక్ ఎదుట హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయమూర్తి 9 మందికి జరిమానా విధించగా, ఇద్దరు వ్యక్తులకు ఒక రోజు జైలు శిక్షతో పాటు రూ.100 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మేడా ప్రసాద్ మాట్లాడుతూ, "ప్రజల ప్రాణ భద్రత కోసం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. పట్టుబడితే కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు. అలాగే, మద్యం సేవించి వాహనాలు నడపకుండా జాగ్రత్తలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలను నడిపితే వాటిని సీజ్ చేసే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చేపడుతున్న ఈ ప్రత్యేక డ్రైవ్‌లకు ప్రజలు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.







# పర్యావరణ స్పృహతో పుడమిని రక్షిద్దాం

- సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి పిలుపు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ప్రతీ ఒక్కరూ పర్యావరణ స్పృహతో భూమి తల్లి రక్షణకు పూనుకోవాలని ప్లాస్టిక్ వినియోగం తగ్గించి మొక్కలు నాటుతూ పచ్చదనాన్ని పెంచుతూ పర్యావరణకు దోహదపడాలని సింగరేణి సంస్థ ఛైర్మన్ ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి పిలుపునిచ్చారు. సింగరేణి భవన్ లో శుక్రవారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆయన మొక్కలను నాటారు. సింగరేణి ఉద్యోగులను ఉద్దేశించి సందేశం ఇస్తూ విధి నిర్వహణలోను తన వ్యక్తిగత జీవితంలో కూడా ప్రతీ ఒక్కరూ పర్యావరణ స్ఫూర్తిని పాటించాలని పిలుపునిచ్చారు. అనంతరం అందరూ పర్యావరణ ప్రతిజ్ఞ స్వీకరించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ పోటీలలో గెలుపొందిన వారికి ఆయన బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు డైరెక్టర్ (పర్సనల్ మరియు ఫైనాన్స్)గౌతమ్ పోట్రు, ఈడీ (కోల్ మూవ్ మెంట్)బి. వెంకన్న, జనరల్ మేనేజర్(కో ఆర్డినేషన్)మార్కెటింగ్ టి.శ్రీనివాస్, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల్లో కూడా అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు, పలుచోట్ల మొక్కలు నాటారు.



# 48 లక్షలతో నీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్...

రాజేంద్రనగర్ మహా ; కిస్మత్‌పూర్ పరిధిలోని శివాలయ టెంపుల్ నుండి హిమగిరి నగర్ రోడ్ నెం07 వరకు త్రాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ ( హెచ్‌ఎం డబ్ల్యూ ఎస్ ఎస్ బి ) ఆధ్వర్యంలో నూతన పైప్‌లైన్ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతంలో మంచినీటి సమస్య తీరనుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు నిరంతరం నాణ్యమైన నీటిని అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారుఈ కార్యక్రమంలో హెచ్‌ఎం డబ్ల్యూ ఎస్ జి ఎం లక్ష్మి, డీజీఎం జవహర్ అలీ, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యత

**సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ**




**భద్రాద్రి బ్యూరో, మహా:** సింగరేణి సంస్థ దేశ ఇంధన అవసరాలను తీర్చడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్)ఎల్.వి.సూర్యనారాయణ అన్నారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ సింగరేణిలో విస్తృత స్థాయిలో హరితీకరణ చేపట్టడం జరుగుతుందన్నారు. మైనింగ్ కార్యకలాపాల వల్ల గాలి నీరు భూ వనరులపై ప్రభావాలను పర్యవేక్షించి ఆధునాతన సాంకేతికతల ద్వారా వివిధ కాలుష్య నియంత్రణ చర్యలను అమలుపరచడం జరుగుతోందని తెలిపారు. గనుల మూసివేత సమయంలో గని పరిసర ప్రాంతాలలో ఓబి డంపులపై మొక్కలను నాటుతున్నామని పేర్కొన్నారు. దీనిలో భాగంగా ఇప్పటి వరకు 16,790 హెక్టార్ల ప్రాంతంలో 6.68 కోట్ల మొక్కలు నాటడం అలాగే సమీప గ్రామస్తులకు 2.32 కోట్ల మొక్కలను ఉచితంగా పంపిణీ చేయటం జరిగిందని తెలిపారు. నీటి సంరక్షణ ప్రయత్నాలలో భాగంగా నీటిపారుదల గృహ వినియోగం కోసం గని నుండి బయటకు తీసిన నీటిని శుద్ధి చేసి అందించడం జరుగుతోందని అన్నారు. పర్యావరణ బాధ్యతతో చుట్టుపక్కల గ్రామాలలో వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఇంకుడు గుంతల నిర్మాణాలు 25కి పైగా చేయడం జరిగిందన్నారు. సాగు నీటి చెరువులలో పూడికతీత చెక్ డ్యామ్‌ల నిర్మాణం అర్బన్ పార్కుల అభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. దీంతో పాటుగా భూగర్భ జలాలను మెరుగుపరచడానికి గనుల ఆవరణలో సుమారుగా 62 నీటి ట్యాంకులు తవ్వడం జరిగిందని తెలిపారు. డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్)కే.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మానవ ఉనికిని కాపాడటానికి ప్రతి ఒక్కరూ విధిగా చెట్లను పెంచి పర్యావరణం కాపాడటం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. డైరక్టర్(ఈ అండ్‌ఎం) ఎం.తిరుమలరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని తెలిపారు. ఇప్పటివరకు 245.50 ఎండబ్ల్యూ సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ కొరకు సింగిల్ యుజ్డ్ ప్లాస్టిక్‌ల వాడకాన్ని నివారించటానికి జ్యూట్ బ్యాగులను అందించారు. వన మహోత్సవం కార్యక్రమాలలో భాగంగా ఎన్విరాన్మెంట్ అండ్ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ కొత్తగూడెం బంగ్లాస్ లో ఏర్పాటు చేసిన మొక్కలను నాటే కార్యక్రమంలో డైరెక్టర్లు పాల్గొన్నారు.

జిఎం(ఎన్విరాన్మెంట్ అండ్ ఫారెస్ట్) బి.సైదులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిఎం(సిపిపి) ఏ.మనోహర్, అడ్వైసరీ(ఫారెస్ట్)ఎం.సి. ఎం.సి.పార్థిన్, గుర్తింపు సంఘం(ఏఐటియూసి) సెంట్రల్ సెక్రటరీ వంగా వెంకటేశ్వర్లు, ప్రాతినిధ్య సంఘం(ఐఎన్‌టియూసి )సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సి.త్యాగరాజన్, కార్పొరేట్ కార్పొరేట్ సిఎంఓఏఐ ఉపాధ్యక్షుడు కేశవ రావు, కార్పొరేట్ పరిధిలోని వివిధ శాఖల జనరల్ మేనేజర్లు, వివిధ శాఖల అధిపతులు, యూనియన్ నాయకులు, ఎన్విరాన్మెంట్ అండ్ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులు ఉద్యోగులు, ఇతర అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.



# మొక్కల పెంపకంతోనే స్వచ్ఛమైన ఆక్సిజన్

**భద్రాద్రి బ్యూరో, మహా:** మొక్కల పెంపకంతోనే స్వచ్ఛమైన ఆక్సిజన్ లభిస్తుందని పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కర బాధ్యత అని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చుంచుపల్లి మండలం రుద్రంపూర్ వి.కే.సి.ఎం ప్రాంతంలో మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కల పెంపకం అత్యంత అవసరమని అన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే పచ్చదనాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, జిల్లా అటవీ అధికారి కృష్ణ గౌడ్ తదితరులు కలెక్టర్‌తో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు సిబ్బంది ప్రజాప్రతినిధులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




# సోంపల్లిలో ఐటీసీ బంగారు భవిష్యత్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు

**బూర్గంపహాడ్, మహా :** బూర్గంపహాడ్ మండలంలోని సోంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐటీసీ బంగారు భవిష్యత్ వాష్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను గ్రామ ప్రజలకు వివరించారు. అలాగే గ్రామ ప్రజలకు చెత్త నిర్వహణ, పరిశుభ్రత, పర్యావరణ సంరక్షణపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. తడి చెత్త – పొడి చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ఆటలు నిర్వహించగా, వాటిలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణపై చైతన్యం పెంపొందించేందుకు కృషి చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాటి లక్ష్మి, ఉప సర్పంచ్ పండగ సౌజన్య, వార్డు సభ్యులు కనుకు మోహన్ రావు, బోరేం గాయత్రి, పంచాయతీ కార్యదర్శి, ఐటీసీ బంగారు భవిష్యత్ వాష్ ఇన్‌స్టిట్యూట్ పీఓ బాలకృష్ణ, సంస్థ ప్రతినిధులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలే ఆధారం: జి.ఎం చింతల శ్రీనివాస్

**సత్తుపల్లి,జూన్ 5: మహార:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సింగరేణి సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో జి.ఎం చింతల శ్రీనివాస్, ఏరియా ఐ.ఎన్.టి.యు.సి వైస్ ప్రెసిడెంట్ బి.కోటేశ్వరరావు కార్యాలయ ఆవరణలో పలు రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిఎం శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలే ఆధారమని, మొక్కలు పెంచి వాతావరణ సమతుల్యత కాపాడడంలో సింగరేణి సంస్థ ముందడుగు వేస్తుందని అన్నారు. వనాలుగా అభివృద్ధి చెందే మొక్కల విత్తనాలు కొనుగోలు చేసి వాటిని నర్సరీలలో మొక్కలుగా అభివృద్ధి చేసి పరిసరాలలో పెంచే విధంగా సింగరేణి చర్యలు చేపడుతుందని వివరించారు. యూనియన్ వైస్ ప్రెసిడెంట్ బి.కోటేశ్వరరావు మాట్లాడుతూ మానవాళికి ఉచితంగా ప్రాణవాయువు అందిస్తున్న మొక్కలను పెంచడం ప్రతి పౌరుడి కనీస బాధ్యత అని గుర్తు చేశారు. మనిషి జీవితంలో జరుపుకునే ప్రతి శుభకార్యానికి మొక్కను నాటే సంస్కృతిని



అలవాటు చేసుకోవాలని కోరారు. అనంతరం పచ్చదనం పరిసరాల శుభ్రతపై ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిష్టారం ప్రాజెక్ట్ ఆఫీసర్ సునీల్ వర్మ, పర్యావరణ శాఖ అధికారి తోట సత్యనారాయణ, సివిల్ ఇంజనీర్ రవికుమార్, సంక్షేమ అధికారిని కావ్య, ఏ.ఐ.టి.యు.సి బ్రాంచ్ సెక్రటరీ సముద్రాల సుధాకర్, ఐ.ఎన్.టి.యు.సి ఫిట్ సెక్రటరీ సీతారామ రాజు, ఏ.ఐ.టి.యు.సి పిట్ సెక్రటరీ నరసింహ రావు పలువురు అధికారులు పాల్గొన్నారు.



# సింగరేణి స్కూల్ రిక్రూట్మెంట్‌లో అవకతవకలు

- విద్యార్థి సంఘం నేత కోట శివశంకర్ ఆరోపణ

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సింగరేణి స్కూల్ రిక్రూట్మెంట్ లో అవకతవకలు జరిగాయని పేరుకే పబ్లిక్ నోటిఫికేషన్ వెయ్యడం జరిగిందని తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ రాష్ట్ర విద్యార్థి యువజన సంఘం ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆరోపించారు. రిక్రూట్మెంట్ వారి ఇష్టానుసారంగా నిర్వహించారని మండిపడ్డారు. ఆ మాత్రం దానికి నోటిఫికేషన్ ఎందుకు ఇచ్చారని పాతావారినే ప్రకటించుకోవచ్చు కదా అని విమర్శించారు. నోటిఫికేషన్ మార్కుల ఆధారంగా కొంత ఎక్స్పీరియన్స్ ద్వారా ఎంపిక జరుగుతుందని కానీ సింగరేణి అధికారులు నోటీసు బోర్డు ద్వారా ఇంటర్వ్యూలు చేపట్టారని ఆరోపించారు. కొత్తగూడెం సింగరేణి స్కూల్లో రిక్రూమెంట్ను రద్దుచేసి మరల ఇంటర్వ్యూలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెం మణుగూరు సింగరేణి స్కూల్లో ప్రతి సంవత్సరం కొత్త వారిని నియమించాలని దృక్పథంతో సింగరేణి యాజమాన్యం స్కూలుకు సంబంధించిన టీచర్లు, పిఈటీ, అటెండర్లకు నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. మొత్తం సింగరేణి స్కూల్ రిక్రూట్మెంట్ కొత్తగూడెం మణుగూరులో అవకతవకలు జరిగాయని దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలనీ కోట శివ శంకర్ డిమాండ్ చేశారు.



# మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య

**మందమర్రి, మహా :** మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధి సండ్రపల్లి గ్రామానికి చెందిన ఏదుల రాజ్ కుమార్ (28) అనే యువకుడు మద్యానికి బానిసై ఆత్మహత్య కు పాల్పడినట్టు తనకు ఫిర్యాదు వచ్చిందని స్థానిక ఎస్సై గోపతి నరేష్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... గత కొంతకాలంగా ఏదుల రాజ్ కుమార్ మద్యానికి బానిస అయ్యాడని తెలిపారు. ఈ కారణంగా కుటుంబంలో తలెత్తిన సమస్యల కారణంగా తాను మనస్థాపానికి గురై గురువారం అదే గ్రామంలోని ఒక యాప చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆయన వెల్లడించారు. శుక్రవారం తన తల్లి ఏదుల లక్ష్మక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నరేష్ వివరించారు. కాగా పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి రాజ్ కుమార్ మృతదేహాన్ని తరలించినట్లు చెప్పారు



# కోర్టు డ్యూటీ పాత్ర కీలకం

**జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

**భద్రాద్రి బ్యూరో, మహా:** నిందితులకు శిక్ష పడేలా చేయడంలో కోర్టు డ్యూటీ అధికారుల పాత్ర కీలకమని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న స్టేషన్ హౌస్ ఆఫీసర్లు కోర్టు డ్యూటీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కోర్టు డ్యూటీ అధికారులకు కేసుల పట్ల పూర్తి అవగాహన స్టేషన్ హౌస్ ఆఫీసర్లు కల్పించాలని సూచనలు చేశారు. బాధితులకు న్యాయం జరిగే విధంగా సమగ్రంగా కేసులను పర్యవేక్షించాలని ఆదేశాలను జారీ చేశారు. సమ్మన్స్ వారెంట్ల జారీలో జాప్యం లేకుండా సకాలంలో సాక్షులకు నిందితులకు అందజేయాలని సూచించారు. కోర్టులో విచారణ నడిచే సమయంలో సాక్షులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూసుకోవాలని సాక్షులకు కేసు వివరాల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. కేసులకు సంబంధించిన సీజ్ చేసిన ప్రాపర్టీని ఎప్పటికప్పుడు కోర్టులో హాజరు పరచాలని తెలిపారు. కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు తమ అధికారులకు తెలియజేస్తూ బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ నేరస్తులకు శిక్ష పడే విధంగా కేసుల పరిష్కారంలో కృషి చేస్తూ బాధితులకు న్యాయం చేకూర్చడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు సబ్ ఇన్స్పెక్టర్లు కోర్టు లైజరింగ్ ఆఫీసర్ కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.



# ప్రీ ప్రైమరీ టీచర్స్ భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

**జూలూరుపాడు, మహా:** మండల పరిధిలోని పాపకొల్లు, జూలూరుపాడు, గుండెపుడి, కొమ్ముగూడెం ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం తరగతుల నిర్వహణ కొరకు ఉపాధ్యాయులు, ఆయాల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బి జుంకీలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ భర్తీకి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అదే విధంగా ఆయా భర్తీకి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా ఏడవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. పైన తెలిపిన విద్యా అర్హతలు కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను మండల వనరుల కేంద్రం ఎం ఆర్ సి జూలూరుపాడు లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సమర్పించాలని కోరారు. దరఖాస్తుల స్వీకరణకు ఆఖరి తేదీ: 08 0626 సాయంత్రం 5.00 గంటల వరకేనని తెలిపారు. దరఖాస్తుదారులు విద్యా అర్హతల ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు జిరాక్స్, కుల ధృవపత్రం, (వర్తించినచో) నివాస ధృవపత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, దరఖాస్తు ఫారముతో జత చేసి ఇవ్వాలన్నారు. కావున అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంఈఓ జుంకీలాల్ కోరారు.

# అనుమానాస్పదస్థితిలో ఉరి వేసుకుని హెడ్ కానిస్టేబుల్ మృతి

కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు

మహా వరంగల్ బ్యూరో ;వరంగల్ నగరంలోని కాశిబుగ్గ, పద్మా నగర్ కు చెందిన తోరెట్టి రామారావు 1990 బ్యాచ్ కు చెందిన కానిస్టేబుల్ ప్రస్తుతం సంగెం పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో పద్మనగర్, కాశిబుగ్గ లోని తన సొంత ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ కు టవల్ తో ఉరి వేసుకుని చనిపోయినట్లు అతని భార్య తోరెట్టి రజిత దేవి దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టడం జరిగింది. సదరు హెడ్ కానిస్టేబుల్ రామారావు కు 1995లో వివాహం జరుగగా వారికి ఇద్దరు కుమారులు వినీత్ రాజ్, సిద్ధార్థ్ రాజ్ కలరు. ఈ సందర్భంగా ఇంతజార్గంజ్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ సందీప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# అడవులు తరగడం వల్లనే పర్యావరణంలో మార్పులు

**కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకూరి**

**జూలూరుపాడు, మహా:** అడవులు తరిగిపోవడం వలనే పర్యావరణంలో పెను మార్పులు సంభవిస్తున్నాయని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకూరి రమేష్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవం, నరేంద్ర మోడీ 12 సంవత్సరాల సూపరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. పర్యావరణం కాపాడటానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని పిలుపునిచ్చినారు. అడవులు తరిగిపోవడం వల్ల పర్యావరణ సమతుల్య దెబ్బతిని అకాల వర్షాలు పడుతున్నట్లు తెలిపారు. పర్యావరణం రక్షించాలంటే మనిషికి ఒక మొక్క నాటి మరొక ఐదుగురిని మొక్కలు నాటే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మాదినేని సతీష్, బిజెపి మాజీ మండల అధ్యక్షుడు సిరిపురపు ప్రసాద్, కిసాన్ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి సిరిపురపు పుల్లారావు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ షరీఫ్, బుడిపుడి ప్రభాకర్, యాలంగి గోపయ్య, తాళ్లూరు సూర్యం, అనంతరాములు, దొంతుల వీరయ్య, వెంకటేశ్వర్లు, కృష్ణ, రైతులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత జిల్లా కలెక్టర్ రాజర్షి షా

- యాపల్ గూడ లో మొక్కలు నాటిన అధికారులు
- నాటిన మొక్కలను కాపాడాలని పిలుపు

**ఆదిలాబాద్, మహా :** మారుతున్న వాతావరణ పరిస్థితులు, గ్లోబల్ వార్మింగ్ సవాళ్లను ఎదుర్కోవడానికి అడవులను రక్షించుకోవడం ఒక్కటే మార్గమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" లో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆదిలాబాదు గ్రామీణ మండలం యాపల్‌గూడ బీట్‌లో అడవుల పునరుజ్జీవనం కోసం సరికొత్త హై డెన్సిటీ మిక్స్డ్ ప్లాంటేషన్ విధానంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ లతో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై భారీగా మొక్కలు నాటారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రపంచ పర్యావరణ పరిరక్షణ, అడవుల విస్తీర్ణం పెంపుదలే ధ్యేయంగా ప్రభుత్వం అటవీ శాఖ ఆధ్వర్యంలో విస్తృతం అవగాహన కల్పిస్తూ సంరక్షిస్తుందని అన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, గ్లోబల్ వార్మింగ్ సవాళ్లను ఎదుర్కోవడానికి అడవులను రక్షించుకోవడం ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. ప్రజల భాగస్వామ్యంతో పచ్చదనం ప్రగతికి ప్రణాళిక" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ఒక ఉద్యమంలా మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, వాటిని వృక్షాలుగా మార్చే వరకు సంరక్షించడం అంతకంటే ముఖ్యమని, నాటిన ప్రతి మొక్కను బ్రతికించుకునేలా అధికారులు, ప్రజలు సమిష్టిగా బాధ్యత తీసుకోవాలని సూచించారు.

జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, సమాజంలో ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. పాస్టిక్ వినియోగాన్ని తగ్గించి తమ వంతు బాధ్యత గా మెలగని సూచించారు. ప్రకృతి సమతుల్యత దెబ్బతింటే మానవాళి మనుగడకే ప్రమాదమని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చని వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తుచేశారు. పోలీస్ శాఖ తరపున జిల్లా వ్యాప్తంగా మొక్కల పెంపకానికి, అడవుల రక్షణకు పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఈ హరిత సంకల్పం విజయవంతం అవుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, ఆదిలాబాదు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సర్పంచ్ నిరోష, డిఎస్పీ జీవన్ రెడ్డి, ఎఫ్డిఓ అరవింద్, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు. విద్యార్థులు, అటవీ, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# తాగే నీటిలో ఫ్లోరైడ్

**గత్యంతరం లేక వినియోగం**
**మంచాన పడుతున్న గ్రామస్తులు**
**పరిష్కారం చూపాలని వినతి**

**ఆదిలాబాద్, మహా :** బేల మండలంలోని మసాల(కే) గ్రామ పంచాయతి పరిధిలని దుబ్బగూడ గ్రామ ప్రజలు ఫ్లోరైడ్ నీటి సమస్య ను ఎదుర్కుంటున్నారు. చుట్టూ కొండలతో ప్రకృతి అందల నడుమ నెలకొన్న ఓ చిన్న కుగ్రామంలో ఫ్లోరైడ్ నీటితో ఎప్పుడు మంచన పడతామో తెలియని పరిస్థితి నెలకొంది. గ్రామంలో తాగునీటిలో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉండటంతో 15 మందికి పైగా గ్రామస్తులు ఫ్లోరోసిస్ బారినపడి కొందరు మంచానికి పరిమితం కాగ, నడుము వంకర, కీళ్ల నొప్పులు, ఎముకల బలహీనత వంటి ఆరోగ్య సమస్యలతో మరి కొందరు బాధపడుతున్నారు.గ్రామంలోని చేతి పంపుల ద్వారా వచ్చే నీటిలో ఫ్లోరైడ్ అధికంగా ఉందని అధికారులు తాగవద్దని సూచించినప్పటికీ, గ్రామస్తులకు ప్రత్యామ్నాయంగా స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కల్పించకపోవడంతో అదే నీటిని వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది. మిషన్ భగీరథ నీటి సరఫరా ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. నల్లాలు అలంకార ప్రాయంగా మారాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామ ప్రజల సమస్యలను గుర్తించిన ఐటిడిఎ ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసినప్పటికీ, ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ప్లాంట్ ఉపయోగంలోకి రాకపోవడంతో ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదంటున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆర్వో ప్లాంట్‌ను వెంటనే ప్రారంభించడంతో పాటు మిషన్ భగీరథ ద్వారా నిరంతర తాగునీటి సరఫరా కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి తమ ఆరోగ్యాన్ని కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు.

# ఎల్‌కేజీ, యూకేజీ నుంచి పది చదివినా ఇంగ్లీష్ మాట్లాడ రాదాయే..!?

- ఇంగ్లీష్ మీడియం పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులకు అరచేతిలో స్వర్గం
- జేబులు నింపుకుంటున్న ప్రైవేటు యాజమాన్యాలు.. నిద్రమత్తులో విద్యాశాఖ
- లోపం విద్యాసంస్థలదా, విద్యార్థిదా, లేక ప్రభుత్వ అధికారులదా..!




**మంచిర్యాల, మహా :** ప్రైవేటు విద్యాలయాలలో ఎల్‌కేజీ, యూకేజీ నుంచి పదవ తరగతి చదివినా విద్యార్థులకు ఇంగ్లీష్ మాట్లాడ రాకపోవడం..!? పట్ల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 12 సంవత్సరాలు లక్షలాది రూపాయలు విద్యార్థుల చదువుకు వెచ్చించిన ఫలితం కానరావడం లేదు. 15 సంవత్సరాల క్రితం ప్రభుత్వ విద్యాలయాలలో ఇంగ్లీష్ మీడియం చదువులు లేకపోవడంతో చాలామంది తల్లిదండ్రులు ప్రవేట్ విద్యాసంస్థలకు పంపించారు. దీనితో మంచిర్యాల జిల్లాలో విద్యాసంస్థలకు భలే డిమాండ్ పెరిగిందని చెప్పవచ్చు. ఒక విద్యాసంస్థలో ఎల్కేజీ, యూకేజీ పిల్లలు చదువుకోవాలి అంటే ఫీజు 20వేల రూపాయలు ముక్కు పిండి మరి వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అదే కాకుండా యూనిఫామ్ దుస్తులు, టెస్ట్ పుస్తకాలు, హోంవర్క్ బుక్స్, పాఠశాలకు వెళ్లేందుకు బస్సు షూస్, టై, బెల్టు తదితరులకు అయా విద్యార్థుల తల్లిదండ్రులు దాదాపుగా సంవత్సరానికి 50వేల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు గణంకాలు తెలుపుతున్నాయి.

**వివరాల్లోకి వెళితే.....**

జిల్లాలో పలు విద్యాసంస్థలు ఇంగ్లీష్ మీడియం చదువులు "ఆహా, ఓహో" అంటూ ఆకర్షణీయ ప్రకటనలతో తల్లిదండ్రులకు అరచేతిలో స్వర్గం చూపిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నాయి. ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో చదివినా విద్యార్థికి నాలుగు వాక్యాలు ఇంగ్లీష్‌లో మాట్లాడటం రావడం లేదు. ఈ దుస్థితికి కారణం విద్యాసంస్థల లోపమా, విద్యార్థి లోకమా, లేక తల్లిదండ్రుల లోపమా అన్న చర్చ జోరుగా సాగుతోంది.

**బోర్డు మీద ఇంగ్లీష్ మీడియం ...లోపల మాత్రం తెలుగు మీడియం***

జిల్లాలో పుట్టగొడుగుల్లా వెలిసిన ప్రైవేటు స్కూళ్లన్నీ "ఇంగ్లీష్ మీడియం" బోర్డు పెట్టుకుని వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నాయి. కానీ క్లాస్‌రూంలోకి వెళితే పాఠాలు మాత్రం తెలుగులోనే చెబుతున్నట్లు సమాచారం. టీచర్లకు సరైన ఇంగ్లీష్ పరిజ్ఞానం లేదు. సైన్స్, మ్యాథ్స్ ఫార్ములాలు బట్టీ పట్టిస్తారు. అర్థం చెప్పరు. ఇంగ్లీష్‌లో ప్రశ్న అడిగితే పిల్లలు బిక్కమొహం వేస్తున్నారని కొంతమంది తల్లిదండ్రుడు వాపోతున్నారు.

**జేబులో కాసులు నింపుకుంటున్న యాజమాన్యాలు**

ఎల్‌కేజీకే 25 వేల రూపాయలు పదో తరగతికి 60 వేల వరకు విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజులు వసూలు చేస్తున్నారు. బుక్స్, యూనిఫాం, ట్రాన్స్‌పోర్ట్ పేరుతో దోపిడీకి అడ్డూ అదుపూ లేదు. "ఇంగ్లీష్ మీడియం అని చెప్పి చేర్పించాం. పదేళ్లు లక్షలు కట్టాం. ఇప్పుడు ఉద్యోగం కొరకు ఇంటర్వ్యూ కు వెళితే మా పిల్లలు చెప్పలేకపోతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితులలో మళ్లీ హైదరాబాదులో స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సు కు పంపిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నిద్రమత్తులో జిల్లా విద్యాశాఖ**

ప్రైవేటు పాఠశాలల్లో బోధనా ప్రమాణాలు పర్యవేక్షించాల్సిన మండల విద్యాధికారి, జిల్లా విద్యాధికారి నిద్రమత్తులో తేలుతున్నట్లు వ్యక్తం అవుతుంది. అనుమతులు లేని స్కూళ్లు, అర్హత లేని టీచర్లతో కొనసాగుతున్న పాఠశాలలపై తనిఖీలు చేపట్టడం లేదని ఆరోపణలు ఉన్నాయి. అర్హత లేని టీచర్లు, అనుమతిలేని విద్యాలయాల గురించి విద్యార్థి సంఘాల నాయకులు మండల విద్యాధికారి, జిల్లా విద్యాధికారులకు ఫిర్యాదులు చేసిన చర్యలు తీసుకోవడం లేదని వివిధ విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

3ప్రవేట్ విద్యాలయాలలో ట్రైన్డ్ టీచర్లు కొరత*

జిల్లావ్యాప్తంగా పలు ప్రవేట్ విద్యాలయాలలో ట్రైన్డ్ టీచర్లు కొరత తీవ్రంగా ఉన్నట్లు సమాచారం. కేవలం యాజమాన్యాలు ఫీజుల కోసమే స్కూళ్లు నడుపుతున్నారనే విమర్శలు సర్వత్ర వ్యక్తమవుతున్నాయి. వివిధ విద్యాలయాల ఉపాధ్యాయులు స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టి సాధించడం లేదని సమాచారం. కేవలం అధిక మార్కుల కొరకు విద్యార్థులను పుస్తకాలను బట్టీ విధానాన్నే ప్రోత్సహిస్తున్నారని పరిశీలకులు భావిస్తున్నారు.



## ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు.

ఎంఈఓ లక్ష్మణ్ నాయక్

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ సర్కిల్ పరిధిలోని ఇందిరా నగర్ పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్, ప్రధానోపాధ్యాయులు బాలస్వామి, ఉపాధ్యాయులతో కలిసి శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యార్థులకు బోధన అందజేస్తారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు దుస్తులు, మధ్యాహ్న భోజనం, అల్పాహారం, రాగి జావా వారానికి మూడు గుడ్లు, అనేక సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాల ఉంటుందన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు అత్యంత స్థాయికి ఎదిగారు. ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలని చేర్పించాలని మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయ క్ విద్యార్థుల తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు వివిధ రకాల శారీరక, సంస్కృతిక, మానసిక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. ఎంపీ పీఎస్ ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్చి వారి భవితకు బాటలు వేయాలన్నారు. 8 మంది విద్యార్థులను ఒకటో తరగతిలో చేర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, మండల సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేష్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



# దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషిముత్తినేని వీరయ్య

- ఉపకరణాలు పంపిణీ చేసిన కార్పోరేషన్ చైర్మన్
- సొంత కాళ్ల పై నిలబడేలా ప్రభుత్వ సహకారం

**నిర్మల్, మహా :** దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో, దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తో కలిసి పాల్గొన్నారు. దివ్యాంగులు తమ సొంత కాళ్ల మీద నిలబడేలా ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తుందని చైర్మన్ అన్నారు. దివ్యాంగుల కొరకు రాష్ట్రంలో ప్రత్యేకంగా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిందన్నారు. 11 వేల దివ్యాంగ పొదుపు సంఘాల్లో దాదాపు 80 వేల మంది దివ్యాంగులు లబ్ధిపొందుతుందన్నారు. దివ్యాంగుల సహాయ ఉపకరణాల పంపిణీ విషయంలో ఉన్న కఠిన నిబంధనలు సవరించామని, దీని ద్వారా ఎక్కువ మంది దివ్యాంగులు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఆరు సంవత్సరాల లోపు దివ్యాంగుల ఆరోగ్యం మెరుగు కోసం బాల భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. దివ్యాంగుల ఉన్నతికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, ఎన్నో అవకాశాలు కల్పిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశాలు ఉపయోగించుకొని, దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. దివ్యాంగుల కొరకు స్కూటీలు, అడ్వాన్స్డ్ చక్రాల కుర్చీలు, ల్యాప్ టాప్ లు, స్మార్ట్ ఫోన్లు, వినికిడి యంత్రాలు, తదితర పరికరాలు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని అన్నారు. వీటి ద్వారా దివ్యాంగులకు ఎంతో మేలు కలుగుతుందని చెప్పారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అర్హులైన పలువురు దివ్యాంగులకు కార్పొరేషన్ చైర్మన్, కలెక్టర్ లు ల్యాప్ టాప్ లు, స్మార్ట్ ఫోన్ లు, అడ్వాన్స్డ్ చక్రాల కుర్చీలు అందించారు. అనంతరం కలెక్టర్ ప్రాంగణంలో కార్పొరేషన్ చైర్మన్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ లు కలిసి 38 మంది దివ్యాంగ లబ్ధిదారులకు ప్రత్యేక స్కూటీలు అందించారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ అధికారి వినూత్న, ఇతర అధికారులు, దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకులు మెరుగైన సేవలందించాలి కలెక్టర్ భవేశ్ మిశ్రా

**డిసిసి, డిఎల్ఆర్ సి సమావేశం**
**బ్యాంకర్లకు పలు సూచనలు**

**నిర్మల్, మహా :** బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, శుక్రవారం 202526 ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసికానికి సంబంధించిన డిసిసి, డిఎల్ఆర్ సి సమావేశం నిర్వహించారు. బ్యాంకుల సహకారం వల్ల ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని, దీనికోసం కావలసిన సహకారం బ్యాంకులు అందించాలన్నారు. పేద ప్రజల ఉన్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకులతో ముడిపడి ఉన్న ఎన్నో రకాల పథకాలు అమలు పరుస్తున్నాయని, ఇవి క్షేత్రస్థాయిలో అర్హులైన పేదలందరికీ అందివ్వాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందన్నారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తత, పొదుపు, బ్యాంకింగ్ పై అవగాహన కలిగేలా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వెనుకబడిన తరగతుల ప్రజలకు, మహిళా స్వయం సహాయక సంఘాలకు, రైతులకు, వీధి వ్యాపారస్తులకు, విద్యార్థులకు అందించు రుణాల మంజూరులో ఆలస్యం చేయకూడదన్నారు. వివిధ రకాల రుణాలకు అర్హులైన దరఖాస్తుదారులకు సంబంధిత రుణాలను అందజేయాలన్నారు. అనంతరం 2026 27 వార్షిక రుణ ప్రణాళిక నివేదికను ఆవిష్కరించారు.ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, ఎస్బిఐ, టిజీబి రీజినల్ మేనేజర్లు రంజన్ కుమార్, నవీన్ కుమార్, ఆర్బిఐ లింక్డ్ బ్యాంకింగ్ ఆఫీసర్ రాములు, ఇతర అధికారులు, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.







# మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా ఇజ్జగిరి సంజయ్

**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా 23వ వార్డు కు చెందిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ ఇజ్జగిరి సంజయ్ నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ఆయన నియామక పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్‌కు అందించారు. ఫ్లోర్ లీడర్‌గా నియామకమైన సంజయ్‌ను చైర్‌పర్సన్ బండారి అనూష శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. తనపై నమ్మకంతో ఫ్లోర్ లీడర్ గా అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు , స్థానిక నాయకులు డిసిసి అధ్యక్షులు నరేష్ జాదవ్ , అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి , గంద్రత్ సుజాత , సాజిద్ ఖాన్ సంజీవ రెడ్డి , బోరంచు శ్రీకాంత్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. తనకప్పగించిన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహిస్తానని అన్నారు.

# మానవ మనుగడకు జీవనాధారం ప్రకృతి

- ఇబ్రహీంపట్నం సుస్థిరాభివృద్ధే లక్ష్యం...పర్యావరణాన్ని కాపాడుకుందాం...
- విస్తరిస్తున్న పట్టణీకరణకు తోడు ప్రకృతి పరిరక్షణ ముఖ్యం....
- నియోజకవర్గం ప్రజలకు పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు...
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి...



**ఇబ్రహీంపట్నం జూన్ 5 మహా:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. రోజురోజుకు హైదరాబాద్ నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో శివారులో ఉన్న ఇబ్రహీంపట్నం పట్టణీకరణకు గురవుతోందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఓ వైపు అభివృద్ధిని స్వాగతిస్తూనే... మరోవైపు పర్యావరణ పరిరక్షణను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. మానవ మనుగడకు జీవనాధారమైన ప్రకృతిని పరిరక్షిస్తూ... భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలువాలని చెప్పారు. ఒక్కొక్కరు ఒక మొక్క నాటడం, నీటిని ఆదా చేయడం, కాలుష్యాన్ని తగ్గించడం వంటి చిన్నచిన్న చర్యలే రేపటి తరాలకు సురక్షితమైన, స్వచ్ఛమైన భూమిని అందించగలవని పేర్కొన్నారు. కాలుష్య ఉద్గారాలను తగ్గించేందుకు విద్యుత్ వాహన వినియోగం, గ్రీన్ ఎనర్జీ దిశగా సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించడం, అర్బన్ పార్కులు, చెరువుల పునరుద్ధరణతో హైదరాబాద్ నగరాన్ని నెట్ జీరో సిటీగా మార్చే లక్ష్యాలతో ప్రజా ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని... ఇందులో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు కృషిచేస్తున్న వారికి ఎమ్మెల్యే ప్రత్యేక అభినందనలు తెలిపారు.



# శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలి..?

**ఇబ్రహీంపట్నం జూన్ 5 మహా:** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు వెళ్లే రహదారిలో, అపోలో ఫార్మసీ ముందు వర్షం పడితే నీరు జమై రాకపోకలకు ఇబ్బందిగా మారుతుంది... గతంలో దుకాణదారులు పలుమార్లు అధికారులకు విన్నపించుకున్న నామమాత్రంగా పనులు చేసి వదిలేసారు. దీంతో సమస్య అలాగే ఉండిపోవడంతో వాహనదారులకు, పాదచారులకు, దుకాణదారులకు ఇబ్బంది నెలకొంది. ఈ యొక్క వర్షపు నీరు నిల్వ ఉండడంతో మురుగుగా మారి దుర్వాసన వెదజల్లుతుంది. ఈ యొక్క సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని పలువురు అధికారులను కోరుచున్నారు..



# అత్తాపూర్‌లో దారుణం..

**భార్యపై భర్త కత్తితో దాడి..**

**చికిత్స పొందుతూ భార్య మృతి..**

రాజేంద్రనగర్ మహా ; అత్తాపూర్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. గురువారం తెల్లవారుజామున 3 నుంచి 4 గంటల మధ్యలో అత్తాపూర్ లోని తేజస్వి నగర్ కాలనీలో అవినాష్, కోమల్ దంపతులకు ఇద్దరు కుమారులతో నివసిస్తున్నారు. విరు నాందేడ్ ప్రాంతానికి చెందినవారు.భార్యపై అనుమానంతో భర్త కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. మహిళ చికిత్స పొందుతూ మరణించిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. కుటుంబ కలహాలు, భార్యపై అనుమానమే ఈ ఘాతుకానికి కారణమైనట్లు స్థానికులు తెలిపారు.స్థానికుల సమాచారంతో అత్తాపూర్ పోలీసులు సంఘటనా స్థలానికిక్లూస్ టీంతో చేరుకుని ఆధారాలను సేకరించారు. హత్య చేసి అవినాష్ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలను పోలీసులు ముమ్మరం చేశారు.



# నీటి గుంతలో పడి అక్కా చెల్లెళ్లు మృతి

**హన్మకొండ మహా;**హనుమకొండ జిల్లా ఖాజీపేట మండలం దుంపలగట్టు గ్రామంలో శుక్రవారం హృదయ విదారక ఘటన చోటు చేసుకుంది. ఆ గ్రామానికి చెందిన వనం సంజన (18), వనం అర్చన (14) అనే ఇద్దరు అక్కాచెల్లెళ్లు ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి మృతి చెందినట్లు సమాచారం. పందుల పెంపకమే జీవనాధారంగా ఉన్న వీరు ప్రతి రోజులాగే తమ తల్లి శివవాణి, తమ్ముళ్లు గౌతమ్, కార్తీక్‌లతో కలిసి పందులను మేపేందుకు గ్రామ శివారులోని నీటి గుంత వద్దకు వెళ్లారు. ఈ క్రమంలోనే ప్రమాదవశాత్తు సంజన, అర్చన నీటి గుంతలో పడి మునిగిపోయారు.సమాచారం అందుకున్న గ్రామస్థులు వెంటనే సహాయక చర్యలు చేపట్టినప్పటికే ఇద్దరూ మృతి చెందినట్లు తెలిసింది. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు కుమార్తెలు దుర్మరణం చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి...

- తెలంగాణ రైతాంగానికి వరం కానున్న కోహెడ అంతర్జాతీయ సమీకృత మార్కెట్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పంతో ప్రపంచ స్థాయి మార్కెట్ నిర్మాణం
- ముఖ్యమంత్రి కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ఇబ్రహీంపట్నం జూన్ 5 మహా:** తెలంగాణ రైతాంగ భవిష్యత్తుకు కొత్త దిశానిర్దేశం చేసే కోహెడ అంతర్జాతీయ సమీకృత మార్కెట్ రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధిలో మైలురాయిగా నిలవనుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి కోహెడలో ప్రారంభించనున్న కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ... గతంలో నిలిచిపోయిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో పునరుద్ధరించి అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు, ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) అనుసంధానం, రవాణా సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని కోహెడ ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. 239 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయనున్న ఈ మార్కెట్‌లో పండ్లు, కూరగాయలు, పూలు, మాంసం, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు-అమ్మకాలు, ఎగుమతి-దిగుమతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆధునిక గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు, లాజిస్టిక్స్ పార్కులు, ప్రాసెసింగ్ యూనిట్లు, రవాణా కేంద్రాలు వంటి ప్రపంచ స్థాయి మౌలిక వసతులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మూడు దశల్లో మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, తొలి దశ పనులను వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, రైతు భరోసా, రైతు బీమా, పంటల కొనుగోలు వంటి కార్యక్రమాల ద్వారా రైతులకు విస్తృత స్థాయిలో మద్దతు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... కోహెడ ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ తెలంగాణ వ్యవసాయ, ఉద్యానవన రంగాల అభివృద్ధికి నూతన ఊపునివ్వనుందని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు అనుసంధానం చేయడం ఈ మార్కెట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ... కోహెడలో నిర్మించనున్న అంతర్జాతీయ స్థాయి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ తెలంగాణ రైతాంగానికి, వినియోగదారులకు ఎంతో ప్రయోజనకరంగా నిలవనుందని, సుమారు 239 ఎకరాల్లో, ఔటర్ రింగ్ రోడ్‌కు ఆనుకుని నిర్మించనున్న ఈ మార్కెట్ దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ ఉత్పత్తులను నేరుగా విక్రయించే అవకాశం కల్పించడంతో పాటు, వినియోగదారులు ఒకే చోట నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసే విధంగా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ నగరానికి మణిహారంగా నిలిచే ఈ మార్కెట్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, మార్కెట్‌లోని ధరలు, లభ్యమయ్యే ఉత్పత్తుల వివరాలు ప్రజలు ఇంటి నుంచే తెలుసుకునే విధంగా వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. రైతు-వినియోగదారుల మధ్య ప్రత్యక్ష అనుసంధానం కల్పించడం ద్వారా రైతులకు మెరుగైన ధరలు, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు, ప్రజాప్రతినిధులు, సభ్యులు హాజరుకానుండగా, వారి రవాణా, పార్కింగ్, తాగునీరు, భద్రత, విశ్రాంతి తదితర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రదర్శనలు, సమాచార కేంద్రాలు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ సంస్థ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, రాష్ట్ర వ్యవసాయం & సహకార శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, మార్కెటింగ్ శాఖ కమిషనర్ గోపి, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం..?

- **వరద నీటి కాలువ నిర్మాణ పనులు పరిశీలన.!**
- **నాణ్యత లోపించకుండా నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలి.?**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి** మహా:నాణ్యత లోపించకుండా నిర్దేశిత సమయంలో వరద నీటి కాలువ నిర్మాణ పనులు పూర్తి చేయాలని హయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అధికారులకు తెలిపారు. ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ నుండి కుమ్మరి కుంట వరకు వరద నీటి కాలువ నిర్మాణ పనులకు సంబంధించి, తన హయంలో మంజూరైన నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులపై మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, ఉన్నతాధికారులతో కలిసి స్థల పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా కాలువ నిర్మాణానికి అవసరమైన లెవెల్స్, వరద నీటి ప్రవాహ మార్గాలు, నిర్మాణానికి అవసరమైన స్థలం మరియు ఇతర సాంకేతిక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వర్షాకాలంలో రాఘవేంద్ర కాలనీతో పాటు పరిసర ప్రాంతాల్లో ఏర్పడుతున్న వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా కాలువ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, హయంలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంజూరు చేయించిన నిధులతో ఈ కీలకమైన వరద నీటి కాలువ నిర్మాణ పనులు చేపట్టబడుతున్నారని, ఈ ప్రాజెక్టు పూర్తయితే వర్షపు నీరు సాఫీగా కుమ్మరి కుంట వరకు చేరి కాలనీల్లో నీరు నిల్వ ఉండే సమస్యకు గణనీయమైన పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం, కాలనీల అభివృద్ధి మరియు వరద సమస్యల నివారణే లక్ష్యంగా ఈ పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిఈ శివకృష్ణ, ఏఈ సాయికృష్ణ గారు, జెఈ బాబురావు, బీజేపీ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గోవింద చారి, నాయకులు ఇట్టబోయిన నర్సింహా, మధు సుధన్ రెడ్డి మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు..



# వరంగల్ ఆఫీసర్స్ క్లబ్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హనుమకొండ మహా ;వరంగల్ ఆఫీసర్స్ క్లబ్‌లో నూతనంగా చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ, ఆఫీసర్స్ క్లబ్‌ను మరింత ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసి సభ్యులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. క్లబ్ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని పేర్కొన్నారు.క్లబ్ అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం సభ్యులకు మరింత సౌకర్యవంతమైన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు



# ప్రెస్ ఫోటోగ్రాఫర్ మహ్మద్ జాకీర్ హుస్సేన్‌కు ఘన సన్మానం

**యాదాద్రి భువనగిరి జూన్ 5 మహా**
భువనగిరి పట్టణంలో మైనారిటీ జర్నలిస్ట్ ఫ్రంట్ (MJF) ఆధ్వర్యంలో ప్రముఖ ప్రెస్ ఫోటోగ్రాఫర్ మహ్మద్ జాకీర్ హుస్సేన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయనను శుక్రవారం ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మైనారిటీ జర్నలిస్ట్ ఫ్రంట్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు మహ్మద్ షుజాఉద్దీన్ మాట్లాడుతూ ప్రెస్ ఫోటోగ్రాఫర్ మహ్మద్ జాకీర్ హుస్సేన్ జర్నలిజం రంగంలో ఫోటోగ్రాఫర్‌గా విశిష్ట సేవలు అందిస్తూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారని కొనియాడారు.

జాకీర్ హుస్సేన్ తన వృత్తిపరమైన సేవల ద్వారా జర్నలిజం అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన ప్రశంసించారు. ఆయన క్లిక్ చేసిన అద్భుతమైన ఛాయాచిత్రాలు (ఫోటోలు) జిల్లాలోని జర్నలిస్టులందరికీ ఎంతో ఉపయోగపడుతున్నాయని షుజాఉద్దీన్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మైనారిటీ జర్నలిస్ట్ ఫ్రంట్ జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ షేక్ హమీద్ పాష, గౌరవ సలహాదారుడు ఇబ్రహీం బియబాని, ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ రషీద్,జర్నలిస్ట్ ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నా



# మాతృమూర్తి పేరుతో మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి..

మాతృమూర్తి పేరుతో ఒక మొక్క నాటి దాన్ని పరిరక్షించి పర్యావరణాన్ని కాపాడుకుందాం. జూన్ 5 అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాటేదాన్ డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో బిజెపి డివిజన్ అధ్యక్షులు గోద పాండు యాదవ్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులతో కలిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. బృందావన్ కాలనీలో 12 సంవత్సరాల మోదీ పరిపాలనకు గుర్తుగా మొక్కలను నాటారు. మొక్కలు నాటడమే కాదు వాటిని పరిరక్షించి పర్యావరణాన్ని కాపాడుకుందాం అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించిన ఈ ఉద్యమం మాతృమూర్తి పేరుతో ఒక మొక్కను నాటమని భారతీయ జనతా పార్టీ నాయకులు ప్రజలను కోరారు. మొక్కల్లో తన తల్లిని చూస్తూ మొక్కలను పరిరక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రావుల భాస్కర్ సంతుగౌడ్, బొమ్మరాజు, నరసింహ, శ్రీకాంత్ రెడ్డి, రమణ గుప్తా, రమేష్, శేఖర్, మజార్, కిరణ్, రాజ్ స్వామి, రామారావు, శంకర్ రెడ్డి, సానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**హన్మకొండ అదనపు కలెక్టర్ రవి**

**హనుమకొండ మహా;**ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎల్కతుర్తి మండల కేంద్రంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ మరియు చెట్ల పెంపకం నేటి కాలంలో అత్యంత అవసరమని అన్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్య ప్రభావాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. భావితరాలకు ఆరోగ్యకరమైన, పచ్చని వాతావరణాన్ని అందించేందుకు సమాజంలోని ప్రతి వర్గం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు రూపొందించిన అవగాహన పోస్టర్‌ను అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ప్రకృతి వనరుల సంరక్షణ, నీటి పొదుపు, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, చెట్ల పెంపకం వంటి అంశాలపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థుల తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.



# మన దేశ సంస్కృతి సాంప్రదాయాలను విశ్వ వ్యాప్తం చేసిన ఘనత చేనేత రంగానిదే

- థ్రెడ్ పోచంపల్లి చేనేత ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన రాష్ట్ర వ్యవసాయ, చేనేత-జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్ / యాదాద్రి భువనగిరి జూన్ 5 మహా :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "Telangana Rising" కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన " థ్రెడ్ పోచంపల్లి" (Thread Pochampally ) చేనేత వస్త్ర ప్రదర్శనను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పోచంపల్లి ఇక్కత్ చేనేత కళకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని, ఇక్కడి నేతన్నల నైపుణ్యం తెలంగాణకు గర్వకారణమని అన్నారు. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన చేనేత సంప్రదాయాన్ని భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు.

పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలకు లభించిన జియోగ్రాఫికల్ ఇండికేషన్ (GI) ట్యాగ్ ఇక్కడి కళాకారుల సృజనాత్మకతకు, నైపుణ్యానికి దక్కిన అంతర్జాతీయ గుర్తింపని మంత్రి తెలిపారు. భూదాన్ ఉద్యమానికి చారిత్రక కేంద్రంగా నిలిచిన పోచంపల్లికి ప్రత్యేక స్థానం ఉందని, పోచంపల్లి రుమాళ్లు, ఇక్కత్ చీరలకు ప్రపంచ మార్కెట్‌లో మరింత ప్రాచుర్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

చేనేత రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేసిన మంత్రి, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో గత రెండున్నర సంవత్సరాల్లో చేనేత రంగం అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం సుమారు రూ.1,400 కోట్లకు పైగా ఖర్చు చేశామని తెలిపారు. నేతన్నల ఉపాధికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

గ్లోబలైజేషన్ పోటీని ఎదుర్కొనేందుకు రాష్ట్రంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (IIHT) ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ సంస్థ ద్వారా చేనేత కుటుంబాల పిల్లలకు ఆధునిక డిజైన్లు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అవసరాలకు అనుగుణమైన శిక్షణ అందించి అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. డూప్లికేట్ ఉత్పత్తుల వల్ల చేనేత బ్రాండ్‌కు కలిగే నష్టాన్ని నివారించడంలో కూడా ఆధునిక సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.ఈ ప్రదర్శనను విజయవంతంగా నిర్వహించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనకు మరింత మంది ప్రజాప్రతినిధులు హాజరయ్యేలా చర్యలు తీసుకుని చేనేత కళాకారులకు ప్రోత్సాహం అందించాలని అధికారులను ఆదేశించారు.

నల్గొండ జిల్లాకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, గజం అంజయ్య, చేనేత సహకార సంఘాల ప్రతినిధులు, చేనేత కార్మికులు మరియు పెద్ద సంఖ్యలో కళాకారులు పాల్గొన్నారు.

# విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో జామాయిల్ తోట దగ్గం

**కారేపల్లి, మహా:** మండల పరిధిలోని బొక్కలతండ స్టేజివద్ద ఉన్న వాకుండోత్ గన్య అనే రైతుకు చెందిన జామాయిల్ తోట పూర్తిగా దగ్ధమైంది. శక్రవారం గన్యకు చెందిన ఎకరంన్నర జామాయిల్ తోటలోని విద్యుత్ వైర్లు గాలికి చెట్లకు రాసుకుని విద్యుత్ సర్క్యూట్ కావడం తోట మొత్తం మంటలు అల్లుకున్నాయి. ఇది గమనించిన బజ్యతండా సర్పంచ్ వాంకుడోత్ హనుమంతరావు ఇల్లెందు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. దీంతో ఇల్లెందు నుంచి అగ్నిమాపక సిబ్బంది తోట చుట్టు మంటలను అదుపూ చేసిన కాని తోట మొత్తం దగ్ధమై పోయిందని రైతు ధన్య తెలిపారు. కాగా పంచాయతీ సిబ్బంది గ్రామంలోని వాటర్ ట్యాంకర్ తో నీటిని తీసుక వచ్చి మంటలు లేవకుండా మంటలను ఆర్పుతున్నారు. కాక జామాయిల్ తోట పూర్తిగా కాలిపోయిన గన్యను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆస్తి నష్టం విలువ మూడు లక్షల వరకు ఉంటుందని అంచన వేశారు.


# రూ.6,000 కోట్ల డీల్

## ఐనాక్స్ క్లీన్ చేతికి వేనా ఎనర్జీ



**న్యూఢిల్లీ:** ప్రయివేట్ రంగ కంపెనీ ఐనాక్స్ క్లీన్ ఎనర్జీ తాజాగా వేనా ఎనర్జీ ఇండియా కొనుగోలుకి ఒప్పందం కుదుర్చుకుంది. తద్వారా 6 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన పోర్ట్‌ఫోలియోను సొంతం చేసుకోనుంది. సంబంధిత వర్గాల అంచనా ప్రకారం ఒప్పందం విలువ రూ. 6,000 కోట్లుకాగా.. వేనా ప్రస్తుతం 1.2 గిగావాట్ల నిర్వహణలోని ఇంధన ఆస్తులతోపాటు.. త్వరలో ప్రారంభంకానున్న చివరి దశ అభివృద్ధిలోని 1.8 గిగావాట్ల ప్రాజెక్టులను కలిగి ఉంది. వీటికి జతగా మరో 3 గిగావాట్ల అభివృద్ధి దశ ప్రాజెక్టులు సైతం ఉన్నట్లు ఐనాక్స్ క్లీన్ వెల్లడించింది. అంతేకాకుండా విద్యుత్ కొనుగోలుకి సోలార్ ఎస్ఈసీఐ, గుజరాత్ ఉర్జా వికాస్ నిగమ్ తదితర వా ణిజ్య, పారిశ్రామిక క్లయింట్లుసహా.. ప్రభుత్వ రంగ పంపిణీ సంస్థలతో ఒప్పందాలను కలిగి ఉంది.

# మొబైల్ రీఛార్జ్ లు పెరగొచ్చు!



దేశంలోని టెలికాం వినియోగదారులకు మరోసారి మొబైల్ రీఛార్జ్‌ల భారం పడే అవకాశం కనిపిస్తోంది. వచ్చే మూడు నుంచి ఆరు నెలల్లో టెలికాం కంపెనీలు టారిఫ్‌లను సుమారు 10 శాతం మేర పెంచే అవకాశముందని యాక్సిస్ క్యాపిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గౌరవ్ మల్హోత్రా అభిప్రాయపడ్డారు. గతంలో జరిగినట్లుగా 15-20 శాతం భారీ పెంపులు అవసరం లేదని, ఈసారి పరిమిత స్థాయిలో ధరల సవరణ జరిగే అవకాశం ఉందని ఆయన సీఎన్‌బీసీటీవీ18 వార్తాసంస్థతో పేర్కొన్నారు. టెలికాం రంగంలో ప్రస్తుతం ఆదాయ వృద్ధి కేవలం టారిఫ్ పెంపులపైనే ఆధారపడడం లేదని మల్హోత్రా వివరించారు. వినియోగదారులు అధిక డేటా ప్రయోజనాలు, 5జీ సేవలు, ప్రీమియం ప్లాన్‌ల వైపు మారుతుండటంతో కంపెనీలకు ఒక్కో వినియోగదారుడి నుంచి వచ్చే సగటు ఆదాయం (ARPU) సహజంగానే పెరుగుతోందన్నారు. టారిఫ్ పెంపు లేకుండానే ఏఆర్‌పీయూ ఏటా 4-5 శాతం మేర పెరుగుతోందని ఆయన అంచనా వేశారు. ఇటీవల సంవత్సరాల్లో జరిగిన టారిఫ్ పెంపులను వినియోగదారులు పెద్దగా వ్యతిరేకించకపోవడం, 5జీ సేవల వినియోగం పెరగడం, అధిక విలువ కలిగిన ప్లాన్‌లకు మారుతున్న కస్టమర్ల సంఖ్య పెరగడం వంటి అంశాలు టెలికాం కంపెనీల ఆదాయాలకు ఊతమిస్తున్నాయి. దీంతో భారీ ధరల పెంపుల అవసరం ప్రస్తుతం కనిపించడం లేదని విశ్లేషకులు భావిస్తున్నారు.మరోవైపు, ఇతర బ్రోకరేజ్ సంస్థలు కూడా 2026లో టెలికాం టారిఫ్‌ల పెంపుపై అంచనాలు వెలువరించాయి. జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా వంటి ప్రధాన సంస్థలు 10-15 శాతం వరకు టారిఫ్‌లను పెంచవచ్చని జెఫరీస్ వంటి సంస్థలు ఇప్పటికే పేర్కొన్నాయి. అయితే ఇప్పటివరకు ఏ టెలికాం సంస్థ అధికారికంగా ధరల పెంపును ప్రకటించలేదు.టారిఫ్‌లు నిజంగానే 10 శాతం పెరిగితే ప్రస్తుతం రూ.299 ఉన్న ప్రీపెయిడ్ ప్లాన్ ధర సుమారు రూ.329కు, రూ.349 ప్లాన్ రూ.384కు చేరే అవకాశం ఉంటుంది. అయితే తుది నిర్ణయం టెలికాం కంపెనీల వ్యూహాలు, మార్కెట్ పరిస్థితులు, పోటీ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.

# గ్లోబల్ మార్కెట్‌లో భారత ప్రభుత్వ బాండ్లు



దేశీయ ఆర్థిక వృద్ధిని మరింత పరుగులు పెట్టించడమే కాకుండా, విదేశీ కరెన్సీ ప్రవాహాన్ని పెంచేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) జూన్ సమీక్షలో కీలక నిర్ణయాలు ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న ఆర్థిక సమీకరణల నేపథ్యంలో భారతదేశంలో విదేశీ పెట్టుబడులకు అడ్డంకులను తొలగిస్తూ నిబంధనలను సరళీకృతం చేస్తున్నట్లు చెప్పింది. ముఖ్యంగా ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ), ప్రవాస భారతీయులకు (ఎన్ఆర్ఐ) ఊరటనిచ్చేలా కేంద్ర బ్యాంక్ కొన్ని రాయితీలను ప్రకటించింది.ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించిన కీలక చర్యల వివరాలు ఇవీ..

**గ్లోబల్ ఇండెక్స్ ల్లో భారత ప్రభుత్వ బాండ్లు**

ప్రభుత్వ సెక్యూరిటీల్లో ఎఫ్‌పీఐ పెట్టుబడుల నిబంధనలను ఆర్‌బీఐ సరళీకరించింది. ఇందులో భాగంగా.. ఇకపై కొత్తగా జారీ చేయబోయే 15 సంవత్సరాలు, 30 సంవత్సరాలు, 40 సంవత్సరాల కాలపరిమితి గల ప్రభుత్వ బాండ్లు అన్నీ 'ఫుల్లీ యాక్సెసబుల్ రూట్' (ఎఫ్ఏఆర్) కిందకు వస్తాయి.ఈ బాండ్లు అంతర్జాతీయ గ్లోబల్ ఇండెక్స్‌ల్లో భాగం కానున్నాయి. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్ నుంచి పెద్ద ఎత్తున పెట్టుబడులు భారత్‌కు తరలివచ్చే అవకాశం ఉంది.

**పరిమితుల తొలగింపు:** ఇతర ప్రభుత్వ సెక్యూరిటీలలో పెట్టుబడులపై ఉన్న పాత పరిమితులను కూడా సెంట్రల్ బ్యాంక్ ఎత్తివేసింది.

**ఎన్ఆర్ఐ పెట్టుబడి పరిమితుల పెంపు**

ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐ) దేశీయ మార్కెట్లో పెట్టే పెట్టుబడుల పరిమితులను భారీగా పెంచింది. అంతేకాకుండా, ఈ సదుపాయాన్ని భారతదేశం వెలుపల నివసిస్తున్న వ్యక్తులందరికీ విస్తరింపజేస్తున్నట్లు ప్రకటించింది. దీనివల్ల విదేశీ నిధుల ప్రవాహం మరింత సులభతరం కానుంది.

**ఫారెక్స్ మార్పిడిపై రాయితీలు**

విదేశీ మారక నిల్వలను స్థిరీకరించేందుకు ఆర్‌బీఐ ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించింది. సెప్టెంబర్ 30 వరకు (నాలుగు నెలల పాటు) రాయితీతో కూడిన ఫారెక్స్ మార్పిడి సదుపాయాన్ని కల్పించనుంది. బ్యాంకులు 3 నుంచి 5 సంవత్సరాల కాలపరిమితి గల ఎఫ్‌సీఎన్ఆర్‌బీ డిపాజిట్లను సేకరించడానికి, వాటి పూర్తి హెడ్జింగ్ ఖర్చును భరించేందుకు సెప్టెంబర్ 30 వరకు ఆర్‌బీఐ ఇదే తరహా సదుపాయాన్ని అనుమతించింది.

**బాహ్య వాణిజ్య రుణాలు**

ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూ) విదేశాల నుంచి బాహ్య వాణిజ్య రుణాలు (ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్‌ఈసీబీ) సేకరించేలా ఆర్‌బీఐ తగిన ప్రోత్సాహకాలను అందించనుంది.

# ఐసీఐసీఐ బ్యాంకుకు సెబీ హెచ్చరిక



దేశీయ ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్‌కు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ షాక్ ఇచ్చింది. వాలంటరీ రిటెన్షన్ రూట్ (వీఆర్ఆర్) కింద స్థానిక రుణ సెక్యూరిటీల్లో విదేశీ పెట్టుబడులకు సంబంధించిన నిబంధనలను ఉల్లంఘించినందుకు సెబీ హెచ్చరిక లేఖ జారీ చేసింది. ఈ మేరకు ఐసీఐసీఐ బ్యాంక్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు దాఖలు చేసిన ఒక ఫైలింగ్‌లో అధికారికంగా వెల్లడించింది.

**అసలేం జరిగింది?**

సెక్యూరిటీ కస్టోడియన్‌గా వ్యవహరిస్తున్న ఐసీఐసీఐ బ్యాంక్ ఒక ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ (ఎఫ్‌పీఐ)కు నిబంధనలకు విరుద్ధంగా లబ్ధి చేకూర్చినట్లు సెబీ గుర్తించింది. వీఆర్ఆర్ ప్రోగ్రామ్ కింద దేశీయ బాండ్లలో పెట్టుబడి పెట్టిన సదరు విదేశీ ఇన్వెస్టర్, లాక్‌ఇన్ పీరియడ్ పూర్తి కాకముందే తన నిధులను స్వదేశానికి తిరిగి తీసుకెళ్లేందుకు ఐసీఐసీఐ బ్యాంక్ అనుమతించింది.

**సెబీ అభ్యంతరం**


నిబంధనల ప్రకారం గడువు ముగియకుండా నిధులను వెనక్కి పంపడం ఆర్‌బీఐ, సెబీ మార్గదర్శకాలను ఉల్లంఘించడమేనని స్పష్టం చేస్తూ సెబీ జూన్ 1న బ్యాంకుకు హెచ్చరిక లేఖ పంపింది. ఈ ఉల్లంఘనకు సంబంధించిన వివరాలను నిర్ణీత కాలపరిమితిలోగా ఎక్స్ఛేంజీలకు వెల్లడించడంలోనూ బ్యాంక్ విఫలమైంది. అనుకోకుండా జరిగిన ఆలస్యం వల్లే ఈ సమాచారాన్ని సకాలంలో సమర్పించలేకపోయామని బ్యాంక్ అంగీకరించింది.

**వీఆర్ఆర్ అంటే ఏమిటి? దాని ప్రాధాన్యత ఏంటి?**

భారతీయ ప్రభుత్వ, కార్పొరేట్ బాండ్ మార్కెట్లలో విదేశీ పెట్టుబడులను దీర్ఘకాలం పాటు నిలిపి ఉంచేలా ప్రోత్సహించడానికి ఆర్‌బీఐ 2019లో ఈ స్వచ్ఛంద నిలుపుదల మార్గాన్ని (వీఆర్ఆర్) ప్రవేశపెట్టింది. సాధారణ ఎఫ్‌పీఐ పెట్టుబడులపై ఉండే కఠినమైన నియంత్రణ అవసరాల నుంచి విదేశీ ఇన్వెస్టర్లకు ఈ మార్గం ద్వారా కొన్ని మినహాయింపులు లభిస్తాయి. అయితే, ఇందుకు ప్రతిగా సదరు విదేశీ ఇన్వెస్టర్ తమ పెట్టుబడుల్లో ఒక కనీస శాతాన్ని నిర్ణీత కాలం పాటు దేశంలోనే ఉంచేందుకు స్వచ్ఛందంగా కట్టుబడి ఉండాలి. కాగా, ఇటీవలే (ఫిబ్రవరిలో) కేంద్ర బ్యాంక్ ఈ ఎఫ్‌పీఐ పెట్టుబడుల కోసం వీఆర్ఆర్‌ను జనరల్ రూట్‌లో విలీనం చేస్తూ నిర్ణయం తీసుకుంది.

**ఐసీఐసీఐ బ్యాంక్ వివరణ**

సెబీ తీసుకున్న ఈ నియంత్రణ చర్యపై ఐసీఐసీఐ బ్యాంక్ స్పందించింది. ఈ హెచ్చరిక లేఖ కేవలం ఒక నిర్దిష్ట సమ్మతి లోపానికి సంబంధించినది మాత్రమేనని తెలిపింది. 'ఈ చర్య వల్ల బ్యాంకు ఆర్థిక స్థితిగతులపై ఎలాంటి ప్రభావం ఉండదు. బ్యాంకు దైనందిన కార్యకలాపాలు లేదా వ్యాపార నిర్వహణకు ఎలాంటి ఆటంకం కలగదు. భవిష్యత్తులో ఇలాంటి సాంకేతిక లోపాలు తలెత్తకుండా అంతర్గత నియంత్రణలను మరింత బలోపేతం చేస్తాం' అని చెప్పింది. బ్యాంకు మొత్తం పనితీరుపై గానీ, భద్రతపై గానీ దీని ప్రభావం ఏమాత్రం ఉండబోదని మేనేజ్‌మెంట్ ఇన్వెస్టర్లకు, ఖాతాదారులకు భరోసా ఇచ్చింది.



## దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL



# రాజ్యసభకు మల్లికార్జున్ ఖర్గే నామినేషన్



**బెంగళూరు:** ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కర్ణాటక నుండి రాజ్యసభ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. బెంగుళూరులోని విధానసౌధలో ఈ నామినేషన్ ప్రక్రియ జరిగింది. ఈ కార్యక్రమంలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కర్ణాటక సీఎం డీ.కె. శివకుమార్, సిద్ధరామయ్య తదితర నాయకులు పాల్గొన్నారు. రాజ్యసభలో ప్రతిపక్షనాయకుడిగా మల్లికార్జున్ ఖర్గే కొనసాగుతున్నారు. ప్రస్తుతం కర్ణాటక నుంచే పెద్దల సభకు ప్రాతినిథ్యం వహిస్తుండగా మరోసారి అదే రాష్ట్రం నుంచి నామినేషన్ దాఖలు చేశారు. కన్నడలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న సంఖ్యాబలం రీత్యా ఆయన రాజ్యసభ ఎంపిక దాదాపు లాంఛనమే. కాగా రాజ్యసభ ఎన్నికలకు జూన్ 1 న నోటిఫికేషన్ విడుదలవగా జూన్ 18న ఎన్నికలు జరగనున్నాయి.

# అడపా దడపా సిగరెట్ కాలుస్తారా? ఈ విషయం తెలిస్తే...!



సిగరెట్లు తాగేవారు చెప్పే సాకులు వింత వింతగా ఉంటాయి. రోజూ తాగను, ఎక్కువగానూ, తాగను, ఏదో అప్పుడప్పుడు, వీకెండ్‌లోనో, ఏ పార్టీలోనో, లేదా మూడ్ బాగా లేనప్పుడు మాత్రమే తాగుతాను అని చెబుతుంటారు. ఎందుకంటే చాలా ఏళ్ల నుంచి లేదా ప్రతిరోజూ సిగరెట్లు కాల్చే వ్యక్తుల్లో మాత్రమే అనారోగ్య సమస్యలుంటాయని నమ్ముతారు. కానీ అలాంటి వారికి ఇదొక హెచ్చరిక. అప్పుడప్పుడు ధూమపానం చేసే వారిలో కూడా పలు అనారోగ్య ప్రమాదాన్ని పెంచుతాయని ఆధారాలు సూచిస్తున్నాయి.ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా మరణాలకు పొగాకు ప్రధాన కారణాలలో ఒకటి. దీనివల్ల ప్రతి ఏడాది 80 లక్షలకు పైగా మరణాలు సంభవిస్తున్నాయి. వీటిల్లో ఎక్కువ, ధూమపానం కారణంగా వచ్చే శ్వాసకోశ వ్యాధులు, క్యాన్సర్లతో ముడిపడి ఉన్నాయి. పొగాకు పొగలో 7వేలకు పైగా ఎక్కువ రసాయనాలు ఉంటాయి, వీటిలో క్యాన్సర్‌కు కారణమయ్యేవిగా తెలిసిన అనేక పదార్థాలు విష పదార్థాలు కూడా ఉన్నాయి. దీని ప్రభావం విషయంలో రోజూ సిగరెట్ తాగేవారికి అప్పుడప్పుడు తాగే వారికి మధ్య పెద్ద తేడా ఉండదు.

**గుండె, రక్తనాళాలపై ప్రభావం**

హృదయనాళ వ్యవస్థ పొగాకు పొగ ప్రభావానికి తొందరగా లోనవుతుంది. పొగత్రాగడం మొదలు పెట్టిన కొద్ది నిమిషాలకే, నికోటిన్ రక్తనాళాలు సన్నబడటానికి, హృదయ స్పందన రేటు పెరగడానికి , రక్తపోటు పెరగడానికి కారణమవుతుంది. కార్బన్ మోనాక్సైడ్ రక్తంలో ఆక్సిజన్ పరిమాణాన్ని తగ్గిస్తుంది, దీని వల్ల గుండె మరింత కష్టపడాల్సి వస్తుంది.పొగత్రాగని వారితో పోలిస్తే, రోజుకు కొన్ని సిగరెట్లు మాత్రమే తాగే వారికి కూడా గుండె జబ్బుల ప్రమాదం గణనీయంగా ఎక్కువగా ఉంటుందని పరిశోధనలో తేలింది.
గుండెపోటు ప్రమాదం పెరగడం. అంగ స్తంభనలో సమస్యలు. రక్తనాళాల లోపలి పొర దెబ్బతినడం
ధమనులలో అడ్డంకులు వేగంగా ఏర్పడటం
రక్తంలో గడ్డలు ఏర్పడే అవకాశం పెరగడం
అంతేకాదు ఈ ముప్పు, మనలో ఎలాంటి లక్షణాలు కనిపించడానికంటే ముందే మన శరీరంలో ప్రారంభం కావచ్చు.

**ఊపిరితిత్తులపై ప్రభావాలు**

ప్రతిసారి పొగ పీల్చినప్పుడు ఊపిరితిత్తులు నేరుగా ప్రభావితమవుతాయి. అడపాదడపా గురైనప్పటికీ అది శ్వాసనాళాలను చికాకు పెట్టి, వాపుకు గురిచేస్తుంది. అప్పుడప్పుడు ధూమపానం చేసే చాలామంది ఈ క్రింది లక్షణాలను కనిపిస్తాయి. నిరంతర దగ్గు, ఆయాసం,శారీరక శ్రమ సమయంలో ఆయాసం, తరచుగా శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు

**క్యాన్సర్ ప్రమాదం**

ధూమపానానికి, క్యాన్సర్‌కు మధ్య ఉన్న సంబంధం అత్యంత ఆందోళనకరమైన అంశాలలో ఒకటి. అప్పుడప్పుడూ సిగరెట్ తాగినా, కూడా పొగాకు పొగలో ఉండే క్యాన్సర్ కారకాలు, DNAను దెబ్బస్తాయి. ఈ నష్టం కాలక్రమేణా పేరుకుపోయి, అసాధారణ కణాల పెరుగుదల సంభావ్యతను పెంచుతుంది. ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రపంచవ్యాప్తంగా అత్యంత సాధారణ , ప్రాణాంతక క్యాన్సర్లలో ఒకటిగా కొనసాగుతోంది. అప్పుడప్పుడు ధూమపానం చేసేవారికి, నిరంతరం ధూమపానం చేసేవారితో పోలిస్తే ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదం గణనీయంగా ఎక్కువగా ఉందని అధ్యయనాలు కనుగొన్నాయి.


# లవర్స్ కోసం.. కుళాయిలు కొట్టేశారు



ప్రేమలో పడితే కొన్నిసార్లు ఆలోచనలకన్నా కోరికలే ముందుకు నడిపిస్తాయి. ప్రియురాళ్లకు గిఫ్ట్‌గా ఐఫోన్ ఇవ్వాలన్న చిన్న ఆశ ఆ యువకులను పెద్ద నేరం వైపు నెట్టేసింది. కానీ వారు వేసిన ప్లాన్ మాత్రం చివరికి ఊహించని మలుపు తిరిగి కటకటాల పాలు జేసింది. ఇద్దరు యువకులు తమ గర్ల్‌ఫ్రెండ్స్‌కు ఐఫోన్‌లు కొనివ్వాలనే ఉద్దేశంతో ఏకంగా రూ.6.5 లక్షల విలువైన లగ్జరీ డిజైనర్ ట్యాప్స్‌ను ఓ గోడౌన్ నుంచి దొంగిలించారు. కానీ ఆ ఖరీదైన వస్తువులు చివరికి కేవలం రూ.20 వేలకే స్క్రాప్ డీలర్‌కు అమ్మేయడం ఈ కేసులో మరో ట్విస్ట్‌గా మారింది. ఓ గోడౌన్ యజమాని ఫిర్యాదుతో ఈ దొంగతనం వెలుగులోకి వచ్చింది. మే 27-28 మధ్య రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గోడౌన్ పైకప్పులోని టిన్ షీట్లు తొలగించి లోపలికి ప్రవేశించి ఖరీదైన సానిటరీ వేర్‌ను ఎత్తుకెళ్లారు. గోల్డ్ టోన్, రోజ్ గోల్డ్, సిల్వర్ ఫినిష్ ఉన్న ప్రీమియం ట్యాప్స్ సహా మొత్తం రూ.6.5 లక్షల విలువైన వస్తువులు చోరీ అయ్యాయి.కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు 20కి పైగా సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు. స్థానిక సమాచారం, టెక్నికల్ ఇన్‌పుట్స్ ఆధారంగా కేవలం 12 గంటల్లోనే కేసును ఛేదించారు. విచారణలో ఇద్దరు మైనర్లు సహా ఒక ప్రధాన నిందితుడు పట్టుబడ్డాడు. ప్రశ్నించగా షాకింగ్ నిజం బయటపడింది గర్ల్‌ఫ్రెండ్స్‌కు ఐఫోన్‌లు కొనాలన్న కోరికతోనే ఈ దొంగతనం చేశామని వారు ఒప్పుకున్నారు. దొంగిలించిన ఖరీదైన ట్యాప్స్‌ను కేవలం రూ.20 వేలకే అమ్మినట్లు కూడా తేలింది. ఆ వస్తువులు కొనుగోలు చేసిన 38 ఏళ్ల ఇర్ఫాన్ అలీని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రేమ కోసం వేసిన "కాస్ట్‌లీ స్కెచ్" చివరికి చీప్ బేరంలో ముగిసి, పోలీసులు కేసును ఛేదించడంతో కథ ముగిసింది. నాగ్‌పూర్‌లో జరిగిన ఈ ఘటన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# భారత్ చివరి కొనను సందర్శించా..

**రాహుల్ గాంధీ**



**శ్రీ విజయపురం:** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అండమాన్ నికోబార్ దీవులను సందర్శించారు. అక్కడి ప్రకృతి సోయగాలు తనను కట్టిపడేశాయని ఎక్స్ ఖాతా వేదికగా రాసుకొచ్చారు. అండమాన్ నికోబార్ దీవులు కేవలం రక్షణపరంగా భారత్‌కు ఎంతో ముఖ్యమైనవని నరేంద్ర మోదీ ప్రభుత్వం చెబుతోందని కానీ వాస్తవానికి అది సరికాదన్నారు. అండమాన్ నికోబార్ చిత్రాలతో కలిగిన వీడియోని ఎక్స్ లో పోస్ట్ చేశారు. రాహుల్ గాంధీ ఎక్స్‌లో అండమాన్ నికోబార్ దీవులపై పోస్ట్ చేస్తూ "నేను భారతదేశపు దక్షిణపు చివరి కొనను సందర్శించాను. ఇందిరా పాయింట్ వద్ద నిలబడ్డాను. శతాబ్దాలుగా నిలబడి ఉన్న చెట్ల కింద నడిచాను. భూమిపైనే అత్యంత జీవకళతో నిండిన పగడపు దిబ్బలలోకి మునిగాను.అక్కడ నివసించే ప్రజలతో కూర్చున్నాను. అటవీ హక్కుల చట్టాన్ని ఉల్లంఘించి భూమిని లాక్కుంటున్న గిరిజన వర్గాలు. భారత ప్రభుత్వం ఈ ద్వీపాలలో స్థిరపరిచిన వలసదారులు, వీరిలో చాలామంది మాజీ సైనికులు, వీరికి సరైన పరిహారం అందడం లేదు." అని అన్నారుబీజేపీ ప్రభుత్వం ప్రజలందరికీ గ్రేట్ నికోబార్ ప్రాజెక్ట్.. కేవలం రక్షణ రంగానికి సంబంధించి మాత్రమే అని చెబుతాయి. కాని అది సరికాదు. ఈ పగడపు దీవులలో 1.5 కోట్ల చెట్లను నరికివేయడం. అధికారిక పటాల నుండి పగడపు దిబ్బలను తొలగించడం. సైనికులు, గిరిజనులను స్థానభ్రంశం చేయడం సరైంది కాదు. కేవలం ఒక వ్యాపారవేత్త భారతదేశపు అత్యంత అమూల్యమైన పర్యావరణ భూమిపై హోటళ్లు , క్యాసినోలను నిర్మిస్తున్నారు. అని రాహుల్ విమర్శించారు.తిరిగి పొందలేని దాన్ని నాశనం చేయడం ఎంతటి లాభానికైనా తగదనే విషయం మీకు తెలుసు అని రాహుల్ అన్నారు. తాను పర్యావరణ సమతుల్య అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ఈ ద్వీపాలు ప్రపంచం ఇంతవరకు చూడని అత్యంత అసాధారణమైన సుస్థిర గమ్యస్థానంగా మారగలవని విశ్వాసం వ్యక్తం చేశారు. అలాంటి భారతదేశం కోసమే మనం పోరాడాలని పోరాడాలి.

# భార్య బడిత పూజకు భర్త బలి




**ఛతర్‌పూర్:** మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్‌లో దంపతుల మధ్య జరిగిన ఘర్షణలో భర్త ప్రాణాలు కోల్పోయాడు. నిందితురాలు నీలం కుష్వాహ తన భర్తను కర్రతో కొట్టి చంపింది. ఆపై ఎనిమిది గంటల పాటు మృతదేహం వద్దే కూర్చుంది. అనంతరం పోలీసులకు లొంగిపోయింది. నీలం గత నాలుగేళ్లుగా తన భర్త దీన్‌దయాల్ కుష్వాహకు దూరంగా పుట్టింట్లోనే ఉంటోంది. జూన్ 1న దీన్‌దయాల్ మద్యం మత్తులో భార్య తల్లిదండ్రుల ఇంటికి వచ్చాడు. దీన్‌దయాల్ బలవంతంగా తలుపులు తెరిచి.. తమ కొడుకును తలకిందులుగా వేలాడదీశాడని నీలం ఆరోపించింది. తన భర్త బిడ్డకు హాని తలపెడతాడేమోనని ఆమె తీవ్ర భయాందోళనకు గురైంది. దీంతో ఆమె కర్రతో దీన్‌దయాల్‌పై దాడి చేసింది. తీవ్ర గాయాలపాలైన దీన్‌దయాల్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. హత్య అనంతరం నీలం దాదాపు ఎనిమిది గంటల పాటు భర్త మృతదేహం పక్కనే కూర్చుంది.

ఆ తర్వాత స్థానిక గుడికి వెళ్లి.. దేవుడి ముందు 10 నిమిషాల పాటు కూర్చుని క్షమాపణలు వేడుకుంది. అక్కడి నుంచి నేరుగా సివిల్ లైన్స్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయింది. రాత్రి 8 గంటల ప్రాంతంలో పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఆమె.. తానే తన భర్తను చంపినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు తెలిపింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. ఇంట్లోని మంచంపై ఉన్న మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వేధింపులు, దాడి ఆరోపణలపై విచారణ జరుపుతున్నామని.. అన్ని కోణాల్లోనూ ఈ కేసును దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



# రష్మిక రెమ్యునరేషన్ రూ. 15 కోట్లు!

సినిమా ఒక్కసారి ముద్దుగా అక్కున చేర్చుకుంది అంటే ఊహించనంత తీరాలకు తీసుకెళ్లి కూర్చో పెడుతుంది. అలాంటి వారిలో రష్మికమందన్నా ఒకరు. ఎక్కడో కర్ణాటకలోని గ్రామంలో పుట్టి పెరిగిన ఈ బ్యూటీ మొదట్లో మాతృభాషలో కథానాయకిగా పరిచయమయ్యారు. ఆ తరువాత టాలీవుడ్‌లోకి దిగుమతి అయి గీత గోవిందం చిత్రంతో ఒక్కసారిగా వెలుగులోకి వచ్చారు. ఆ తరువాత పుష్ప చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో ఫేమస్ అయ్యారు. ఇక గుడ్‌బై చిత్రంతో బాలీవుడ్లో పాగా వేసిన రష్మిక యానిమల్ చిత్రంతో కమర్షియల్‌గా సూపర్‌హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. ఇక ఆ తరువాత ఒకటి రెండు చిత్రాలు ఫ్లాప్ అయినా కేరీర్‌కు వచ్చే డోకా ఏమీ ఉండదు. రష్మిక విషయంలో ఇదే జరుగుతోంది. సల్మాన్‌ఖాన్‌కు జంటగా నటించిన చిత్రం నిరాశ పరిచింది. ఇటీవల నటుడు విజయ్ దేవరకొండను ప్రేమించి పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నారు.


ఇక్కడ పెళ్లి అయిన హీరోయిన్లకు కెరీర్ దెబ్బ తింటుందన్న ఆనవాయితీని ఈ బ్యూటీ తిరగరాశారు. ఇప్పుడు ఈ క్రేజీ భామ రేంజ్‌కు వరుసగా భారీ అవకాశాలు రావడమే కాదు పారితోషికాన్ని భారీ మొత్తంలో ముట్టచెబుతున్నారు. అది ఎంతగా అంటే ఇప్పటి వరకు దక్షిణాది టాప్ హీరోయిన్లు తీసుకుంటున్న పారితోషికాన్ని బీట్ చేసేంతగా. ఇప్పటి వరకు దక్షిణాది హీరోయిన్లలో అత్యధికంగా నయనతార రూ.10 కోట్ల తీసుకుంటున్న ప్రచారం జరుగుతోంది.

రష్మిక ఇప్పుడు కాక్–టెయిల్–2 చిత్రంలో రూ.15 కోట్లు పారితోషికం తీసుకుంటున్నట్లు ప్రచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఇదే నిజమైతే పారితోషికం విషయంలో ఈ అమ్మడు నయనతారను బీట్ చేసినట్లే అవుతుంది.



# టెస్ట్ షూట్‌లోనే హీరోయిన్‌పై దర్శకుడి ప్రశంసలు

ఎవరికైనా ప్రశంసలు అంత సులభంగా రావు. కొందరు ముఖస్తుతి కోసం ప్రశంసలు కురిపించినా, నిజమైన ప్రశంసలు ప్రతిభతోనే వస్తాయి. అలా నటి కయదులోహర్ టెస్ట్ షూట్‌లోనే దర్శకుడు మారిసెల్వరాజ్ ప్రశంసలు అందుకున్నారు. బైసన్ వంటి సూపర్ హిట్ చిత్రం తరువాత మారిసెల్వరాజ్ ధనుష్ హీరోగా చిత్రం చేయనున్నట్లు ప్రకటించారు. అయితే ఈ చిత్రం ప్రారంభానికి మరి కొంత సమయం పడుతుండడంతో మారి ఈ మధ్యలో మరో చిత్రం చేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రానికి మంజనధి అని టైటిల్‌ను నిర్ణయించారు. ఇందులో తన తొలి చిత్రం పరియేరుమ్ పెరుమాళ్‌లో నటించిన కదిర్ హీరోగా చిత్రం చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో ఆయనకు జంటగా ముగ్గురు హీరోయిన్లు నటించనున్నట్లు సమాచారం. అందులో కయదులోహర్, ప్రియాంకమోహన్ ఇప్పటికే ఎంపికయ్యారు.
ఇందులోని ఒక కథానాయకి పాత్రకు నటి కయదులోహర్ సరిగా నప్పతారా అన్న సందేహం దర్శకుడు మారికి కలిగిందట. దీంతో ఆమెకు మాత్రం టెస్ట్ షూట్ నిర్వహించారట. అందులో ఆమె నటన చూసి దర్శ కుడు ఫిదా అయినట్లు యూనిట్ సభ్యులు పేర్కొన్నారు. ఈ చిత్రం తరువాత కయదులోహర్ ఇంతకుముందు నటించిన చిత్రాలన్నింటిని మరిచిపోయారని యూనిట్ వర్గాలు పేర్కొన్నాయి. అలా టెస్ట్ షూట్‌లోనే దర్శకుడు ప్రశంసలు అందుకోవడం ఆమెకు పెద్ద ఎసెట్ అవుతుంది. ఈచిత్రంలో మరో కథానాయికి కూడా ఉంటుందని సమాచారం. ఇకపోతే దర్శకుడు మారినే నిర్మాతగా వ్యవహరిసు న్న ఈ చిత్రానికి ఇళయరాజా సంగీతాన్ని అందిస్తున్నారు.



# ఆహారాన్ని కాదు విషాన్ని పండిస్తున్నాం..

టాలీవుడ్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్ర చేస్తున్న సినిమా 'ద ఇండియన్ స్టోరీ'. మన దేశంలో పురుగు మందుల వల్ల ఎలాంటి నష్టాలు జరుగుతున్నాయే అంశం ఆధారంగా ఈ మూవీ తీశారు. ఇందులో కాజల్.. న్యాయవాదిగా కనిపించనుంది. కోర్ట్ రూమ్ డ్రామాగా దీన్ని తెరకెక్కించారు. వచ్చే నెల 24న థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ క్రమంలోనే ఇప్పుడు టీజర్ రిలీజ్ చేశారు.

అయితే సినిమాలోని విజువల్స్ ఏం చూపించకుండా కాన్సెప్ట్ ఏం ఉండబోతుందనే స్లైడ్స్ మాత్రమే వేశారు. 'మనం ఆహారాన్ని కాదు విషాన్ని పండిస్తున్నాం', '50 వేలకు పైగా మెట్రిక్ టన్నుల పురుగు మందులు వాడుతున్నాం', '20 కోట్ల మంది ప్రజలు వీటి బారిన పడ్డారు', 'ప్రతి మూడు కుటుంబాల్లో ఒకటి క్యాన్సర్‌తో పోరాడుతోంది', 'ప్రతి నిమిషానికి ఒకరిద్దరు చనిపోతున్నారు', 'ప్రతి ఏడాది 10 లక్షల మందికి పైగా చనిపోతున్నారు', ఇదే 'ద ఇండియా స్టోరీ' అని చూపించారు. ఈ సినిమా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల కానుంది.

# సిగ్మా స్టైల్

సందీప్ కిషన్ హీరోగా నటించిన తాజా సినిమా 'సిగ్మా'. ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో రాజు సుందరం, సంపత్ రాజ్, శివ్ పండిట్, అంబు దాసన్, యోగ్ జాపీ ప్రధాన పాత్రల్లో నటించారు. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మించిన ఈ సినిమా జూలై 31న విడుదల కానుంది. గురువారం ఈ సినిమా నుంచి 'సిగ్మా స్టైల్' అంటూ ఈ సినిమా మ్యూజిక్ వీడియోను మలయాళ నటుడు–నిర్మాత దుల్కర్ సల్మాన్ లాంచ్ చేశారు. "సందీప్–ఫరియాల డైనమిక్ పెర్ఫార్మెన్స్, ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ తమన్ మాస్ ట్యూన్, జేసన్ సంజయ్ రాసిన క్యాచీ లిరిక్స్‌తో 'సిగ్మా స్టైల్' పాటను ఇన్‌స్టంట్ చార్ట్‌బస్టర్‌గా నిలబెట్టాయి" అని యూనిట్ పేర్కొంది.



## ఈసారి మరింత బోల్డ్ గా..
# ఓటీటీ స్ట్రీమింగ్ ఫిక్స్



ఓటీటీలకు సెన్సార్ ఉండదు. కాబట్టి బూతు, రొమాంటిక్ జానర్ సినిమాలు, సిరీస్‌లు అప్పుడప్పుడు రిలీజ్ అవుతుంటాయి. ఇప్పుడు అలానే బోల్డ్ రొమాంటిక్ కాన్సెప్ట్‌తో తీసిన తెలుగు సిరీస్ స్ట్రీమింగ్‌కి సిద్ధమైంది. ఈ మేరకు అధికారికంగానూ ప్రకటించారు. ఇంతకీ దీని సంగతేంటి? ఎందులోకి రానుంది? 2024లో 'ష్' పేరుతో తమిళంలో ఓ సిరీస్ తీశారు. సోనియా అగర్వాల్, ఇనయా, ఐశ్వర్య దత్తా తదితరులు ప్రధాన పాత్రలు చేశారు. దీని గతేడాది తెలుగులోనూ డబ్బింగ్ చేసి విడుదల చేశారు. తర్వాత కొన్నిరోజులకే రెండో సీజన్ కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో కొత్త పాత్రలు కొత్త కాన్సెప్ట్ చూపించారు. ఇప్పుడు దీనికి కొనసాగింపుగా మూడో సీజన్ కూడా స్ట్రీమింగ్ చేయబోతున్నారు. ఈసారి మరింత బోల్డ్ కంటెంట్ ఉండబోతుందన్నట్లు హింట్ ఇచ్చారు.జూన్ 12 నుంచి అంటే వచ్చే శుక్ర వారం నుంచి 'ష్ సీజన్ 3' ఆహా ఓటీటీలో తెలుగు, తమిళంలో అందుబాటులోకి రానుంది. ఈ సీజన్‌లో ఒకప్పటి హీరోయిన్ పూనమ్ బజ్వా, బిగ్‌బాస్ ఫేమ్ దివి, కిరణ్ రాథోడ్ తదితరులు ప్రధాన పాత్రలు చేశారు. వీళ్లంతా సోషల్ మీడియాలో గ్లామర్ ఫొటోలు, వీడియోలతో ఇప్పటికే ఫేమస్.

## సినీ పరిశ్రమలో విషాదం..
# ప్రముఖ నిర్మాత పహ్లాజ్ మృతి



సినీ పరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ సినీ నిర్మాత, సీబీఎఫ్‌సీ మాజీ ఛైర్మన్ పహ్లాజ్ నిహలానీ కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నా ఆయన కాలేయ సంబంధిత ఆరోగ్య సమస్యలతో మృతి చెందారు. హిందీ చిత్ర పరిశ్రమలో ఆయన ప్రముఖ నిర్మాతగా గుర్తింపు తెచ్చుకున్నారు. పహ్లాజ్ నిహలానీ తన కెరీర్‌లో 'ఆంఖేన్', 'అందాజ్', 'తలాష్', 'రంగీలా రాజా', 'జూలీ 2' వంటి అనేక బాలీవుడ్ చిత్రాలను నిర్మించారు. అంతేకాకుండా 2015 నుంచి 2017 వరకు సీబీఎఫ్‌సీ ఛైర్‌పర్సన్‌గా పనిచేశారు. సెన్సార్‌షిప్, ఫిల్మ్ సర్టిఫికేషన్ బోర్డులో ఆయన ఉన్న సమయంలో, తీసుకున్న అనేక నిర్ణయాలు చిత్ర పరిశ్రమలో చర్చలకు దారితీశాయి. నిహలానీ నిర్మాతగా వివిధ జానర్‌లకు చెందిన అనేక కమర్షియల్ హిందీ చిత్రాలు నిర్మించారు. హిందీ చిత్ర పరిశ్రమకు దశాబ్దాల పాటు ఆయన సేవలందించారు. ఆయనకు భార్య నీతా, ముగ్గురు కుమారులు విశాల్, దీపేశ్, చిరాగ్ ఉన్నారు.

OWNED BY N SREENIVAS RAO. EDITED, PRINTED AND PUBLISHED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com